# జీవిత సభ్యత్వం

## 2011 మార్చి-2011 ఏప్రిల్‌లలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | ఏప్రిల్ 2011 | శ్రీ ఆర్. వీరేంద్ర, హైదరాబాద్ | రు. 500.00 |
| 2. | ఏప్రిల్ 2011 | శ్రీ ఇ.ఎన్. మూర్తి, విశాఖ తిరుపతి, | రు. 1000.00 |
| 3. | ఏప్రిల్ 2011 | శ్రీ డి. రామప్పడు, రాజాం, శ్రీకాకుళం | రు. 1000.00 |
| 4. | ఏప్రిల్ 2011 | శ్రీ సి. శాంతారాం, కాకినాడ | రు. 1000.00 |
| 5. | ఏప్రిల్ 2011 | శ్రీమతి ఎ.బి.టి. సుందరి, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 6. | ఏప్రిల్ 2011 | శ్రీ చెన్నారెడ్డి, చిలమత్తూరు, హిందూపురం, | రు. 500.00 |
| | | | **రు. 5000.00** |

## జీవిత - వార్షిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ. 500/- చొప్పున చెల్లించవచ్చు.
3) జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది.
4. వార్షిక సభ్యత్వం రూ. 100/- 6) బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500 087, ఫోన్: 99595-53218.**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310
Postal Concession: HSF/789/2009-11, Dt.07-01-2009

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి :10 సంచిక: 12 హైదరాబాద్ 2011 ఏప్రిల్ పేజీలు: 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ. 100/-**



# వెంకట్రావ్‌పేటలో బాబా సహవాస్

**ఏప్రిల్ 24, ఉ. 7 నుండి 2 గంటల వరకు.**

ఆదిలాబాద్‌జిల్లా లక్సెట్టిపేటకు సమీపంలోని వెంకట్రావుపేట గ్రామంలో క్రొత్తగా నిర్మించిన మెహెర్‌బాబా సెంటర్ భవన ప్రాంగణ ప్రారంభోత్సవ సందర్భంగా ఏప్రిల్ 24, ఆదివారం ఉ.7 నుండి 2 గంటలదాకా ప్రత్యేక బాబా సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శ్రీ ప్రకాశరావు తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీ ఎన్. కిషన్ రావు, ఫోన్- 98490- 59476 సంప్రదించగలరు.

# కరీంనగర్ జిల్లాకు మెహెర్‌నాథ్ కల్చూరీ

**2011 జూన్ 4,5 తేదీలలో**

కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల సెంటర్ 28వ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 4, ఉదయం 7 నుండి 2 గంటల వరకూ ప్రత్యేక సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శ్రీ బద్దెపురి బాలయ్య తెలిపారు. అలాగే, అదే రోజు సాయంత్రం 6 నుండి 9 గంటల వరకూ కరీంనగర్ లోని సాయినగర్ బాబా సెంటర్‌లో సత్సంగ్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శ్రీ యన్. నరసింహారావు తెలిపారు. కాగా, జూన్ 5, ఉదయం 7 గంటల నుండి 5 గంటల దాకా తెట్టెకుంట అగ్రహారంలోని బాబా సెంటర్ 9వ వార్షికోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రేమిక సహవాస్ ఏర్పాటుచేసినట్లు శ్రీ దుగ్యాల ప్రభాకర్ తెలిపారు. ఈ మూడు కార్యక్రమాలకు మెహెరాబాద్ నుండి ప్రత్యేక అతిధులుగా విచ్చేస్తున్న శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ, శ్రీమతి రాజశ్రీ కల్చూరీలతోపాటు పలువురు బాబా ప్రేమికులు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుండి పాల్గొంటున్నట్లు శ్రీ దుగ్యాల తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీ దుగ్యాల ప్రభాకర్ (9441865485) సంప్రదించగలరు.

# వర్ని 8వ వార్షికోత్సవం

నిజామాబాద్ జిల్లా వర్ని బాబా సెంటర్ వార్షికోత్సవం 2011 జూన్ 12న ఉదయం 9 నుండి 2 గంటల దాకా నిర్వహిస్తున్నట్లు శ్రీ జనార్ధనరావు తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొని బాబావారి ప్రేమాశీశ్శులు పొందాలని అన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక బాబా ప్రేమికులు శ్రీ హనిమిరెడ్డి ( 94411 34407), శ్రీ నాగరాజు ( 94416 10194) సంప్రదించగలరు.





# బాబా సందేశం

## నిస్వార్థ సేవ, ప్రేమ, ఈ రెండూ దైవీ గుణాలు

Selfless service and love
are twin divine qualities

**- MEHER BABA**

గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
040-65699611
040-64542370

## లోపలి పేజీలలో...

| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. శామ్‌కేరావాలా | 6-9 |
| 3. స్వర్గం - నరకం | 10-13 |
| 4. ఇదే నా విధానం | 14 |
| 5. Go to hell | 15 |
| 6. మధుసూధన్, సుభద్ర | 16-19 |
| 7. లార్డ్ మెహెర్ | 20-30 |
| 8 ప్రార్ధనలు | 31-32 |
| 9. పశ్చత్తాప ప్రార్ధన | 33-34 |
| 8. మామాటలు | 30-35 |
| 9. బాటసారులు | 36-37 |
| 11. జీవిత సభ్యులు | 38 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# మెహెరస్థాన్ ధర్మశాల 6వ వార్షికోత్సవం

**2011 జూలై 31 ఆదివారం, ఉ. 7.30 నుండి సా.6.30 దాకా**

మెహెరస్థాన్ ధర్మశాల 6వ వార్షికోత్సవం సందర్భంగా 2011 జూలై 31 ఆదివారం ఉదయం 7.30 నుండి సాయంత్రం 6.30 దాకా అంతర్ దేశీయ ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసినట్లు శ్రీ వై.యస్. రావు తెలిపారు. మెహెరాబాద్ నుండి మెహెర్‌నాథ్ కల్చూరీతోపాటు మహారాష్ట్ర, ఉత్తరాంచల్, కర్నాటక, రాష్ట్రాలనుండి పలువురు బాబా ప్రేమికులు సూమారు 40 మంది ప్రత్యేక అతిధులుగా విచ్చేస్తున్నారని శ్రీ రావ్ తెలిపారు. కాగా విచ్చేసే ప్రేమికులందరి కోసం జూలై 30 నుండి బస, భోజన ఏర్పాట్లు చేశామని, కార్యక్రమంలో ప్రారంభం నుండి చివరిదాకా పాల్గొని అవతారుని ఆశీశ్శులు అందుకోవల్సిందిగా అయన కోరారు.

# రాష్ట్ర స్థాయి మెహెర్ సంకీర్తన ప్రవంతి

**రాష్ట్ర స్థాయి మెహెర్ సంకీర్తన ప్రవంతి** అనకాపల్లి – తుమ్మపాల, విశాఖపట్నం సెంటర్ల సంయుక్త ఆధ్వర్యంలో 2011 మే 14 సా. 5గంటలనుండి మే 15 ఉదయం 5 గంటలవకరూ నిరంతర సంకీర్తనా ప్రవంతిని అనకాపల్లిలోని స్థానిక డాక్టర్ రావు గోపాలరావు కళా క్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఆసక్తిగల బాబా ప్రేమికులలో గల ఔత్సాహిక గేయ కళాకారులు, అలాగే ఈ కార్యక్రమ నిర్వహణలో సహకరించేలా వాలంటీర్లుగా పాల్గొనగోరు బాబా ప్రేమికులు తమ వివరాలను శ్రీ జె.విశ్వనాధం ( 9391540311) లేదా వి. శ్రీనివాసరావు ( 9704002987) 2011 ఏప్రిల్ 30 లోగా తెలియజేయవల్సిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# మెహెర్‌బాబా కదిరి కేంద్రంలో సహవాస్

అనంతపురం జిల్లాలోని కదిరి **23.07.011** నుండి మూడు రోజుపాటు అవతార్ మెహెర్‌బాబా ప్రేమికుల సహవాస్ కార్యక్రం ఏర్పాటు చేసినట్లు ఆహ్వానం పంపారు.

# చదవండి – చదివించండి

మెహెర్‌బాబా మీ మిత్రులు – బంధువులకు బహుమతిగా అందించండి? చదవండి.
వార్షిక చెందా రూ.100/-, జీవిత సభ్యత్వం – 1000/-





## సంపాదకీయం

# ఎవరు ఎలా.. ..,

I was Rama, Krishna, Budha, Jesus, I was this One , I was that One and now I am Meher Baba... అని మెహెర్‌బాబా చాలా స్పష్టంగా పలు సందర్భాలలో ప్రకటించారు. తూర్పు గోదావరి జిల్లాలోని మెహెర్ మండపేట, హమీర్‌పూర్ పర్యటనల సమయంలో బాబా తాను రామావతారంలో తిరిగిన అక్కడి ప్రదేశాల గురించి తన ప్రేమికులతో ముచ్చటించారు.

ఏది ఏమైనా బాబా ఏమన్నారు...

నా గురించి ఎవరు ఎలా భావిస్తే వారికి నేను అలాగే అగుపిస్తానన్నారు. అన్నీ తెలిసిన జ్ఞాని దేన్నీ తారుమారు చేయదనీ స్పష్టం చేశారు.

He who knows everything
displaces nothing.
To each one I appear to be
what he thinks I am.

బాబా తన ప్రేమికులకు ఎన్నో ప్రవచనాలు, సందేశాలు ఇచ్చారు. బాబా సందేశాలు చాలా సున్నితమైనవిగా, సరళంగా వుంటాయి.

.........for piligrims of the path, life is a test,
when relinquished through love, life is at its best ....

అన్నారు. అంటే, ..ఆధ్యాత్మిక పధంలో నడిచేవారికి జీవితం ఒక పరీక్ష అని బాబా అన్నారు. ప్రేమతో జీవితం గడపటం అత్యుత్తమమైనది అని బాబా సెలవిచ్చారు. మనం సహజంగా ఆశించే సంతోషం పొందాలంటే, మనపట్ల కఠినంగానూ, ఇతరులపట్ల ఎంతో సహనంగానూ ఉండమని బాబా అన్నారు. ఇది ఓ బలహీనత లేదా పిరికితనం కాదన్నారు. ధైర్యసాహసాలు వున్నవారే ఈ రకంగా ప్రవర్తించగలరని, ఇది శాశ్వతానందానికి, భగవంతునికి చేరువకావడానికి ఇది దగ్గరి దారి అని బాబా అన్నారు. భగవంతుని దర్శించడం అసాధ్యం కాదని పేర్కొంటూ, నీ తలపై వున్న సూర్యుని వంటివాడు భగవంతుడు. ఆ సూర్యుడి నుండి తప్పించుకొనేందుకు నీవు వాడే గొడుగు మాదిరి, నీలోని సంస్కారాలే నిన్ను దేవుడిని దరిచేయనీయకుండా అడ్డుపడుతున్నాయని మెహెర్‌బాబా తన ప్రవచనాలలో పేర్కొన్నారు.

# శ్యామ్ కేరేవాలా

**– పియస్‌కె. శర్మ, హైదరాబాద్**



శ్యామ్ కేరేవాలా మెహెరాబాద్ ఇటీవల ఏప్రిల్ 2,3 తేదీలలో హైదరాబాద్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 2, శనివారం సాయంత్రం కోఠి సెంటర్ సత్సంగ్ లో, ఏప్రిల్ 3, ఆదివారం ఉదయం 9 నుండి సాయంత్రం 4 దాకా జూబ్లీ సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శ్యామ్ కేరేవాలా మెహెర్‌బాబా సందేశాలపై ప్రసంగించారు. శ్యామ్‌జీ ప్రసంగం ఆద్యంతం చిన్ని కథల రూపంలో వుంటుంది. సిద్దార్ధుని కాలం నాటి కథలు,జలాల్ రూమీకి సంబందించిన కథలను జోడించి, అందరికీ అర్ధమయ్యేలా సరళ భాషలో మాట్లాడ్డం కేరేవాలా ప్రత్యేకత అనాలి. అలాగే, ఆయన తన సహజ చతురతతో బాబా సందేశాలపై ఎన్నో విషయాలు తెలియజేశారు. ముందుగా తన గురించి ప్రస్తావిస్తూ, తాను కమర్షియలో ఓడల్లో రేడియో ఆఫీసరుగా పనిచేసే రోజుల గురించి ప్రస్తావిస్తూ అప్పట్లో తన వయస్సు 50 ఏళ్ళు నిండాయి. ఆరోగ్యంగా, హూషారుగానే వున్నా, ఏడాదికోమారు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ యాజమాన్యానికి సమర్పించాలి. అలా ఓ సందర్భంలో స్థానిక డాక్టరు పరీక్ష చేస్తూ, ఏభై నిండాయి కదా. ఇక హాయిగా విశ్రాంతి తీసుకో అని సలహా ఇచ్చాడు. నేను సిద్దంగానే వున్నాను,





అందుకు మీరు సర్టిఫికేట్ ఇవ్వండి. వి ఆర్ ఎస్...అంటే స్వచ్ఛంద పదవీ విరమణ చేసేస్తానన్నారు. అదేమాదిరిగా వారి డాక్టర్ సర్టిఫికేట్ ఇవ్వడం, వి ఆర్ ఎస్ తీసుకోవడం అన్నీ యాదృచ్ఛికంగా ఒకదాని తర్వాత ఒకటి జరిగిపోయాయి. నేను విఆర్ఎస్ తీసుకున్న ఏడాది తర్వాత , ఓడల్లో కొత్త టెక్నాలజీ అమలు చేస్తున్నామని చెప్పి, అప్పట్లో వున్న వారందరినీ ఉద్యోగంలోనుంచి తొలగించే పరిస్థితి ఎదురైందని, ఐతే బాబా మమ్మల్ని కాపాడాడు అని ముగించారు.

పాశ్చాత్య బాబా ప్రేమికుడు లూయియీ వాన్ గేస్టీన్స్, ఆయన భార్య ఒక సందర్భంలో మెహెరాబాద్‌లో వున్నారు.

బియాండ్ వర్డ్స్ పేరిట లూయియీ బాబా గురించి ఒక మంచి గ్రంథం కూడా రాశాడు. ఐతే, లూయియీ భార్యకు మాత్రం బాబా పట్ల భగవంతుడన్న నమ్మకం ఆమెకు లేదు. వీరు మెహెరాబాద్‌లో వున్న రోజుల్లో , బాబా మస్తులకు కాళ్ళు కడిగి, దుస్తులు దక్షిణగా ఇస్తున్నారు. ఇది చూస్తున్న లూయియీ భార్య, అమె ప్రక్కనే వున్న బాబా సోదరి మణిజా ఇరానీతో, అమె చెవిలో .. మెహెర్‌బాబా చాలా గుడ్ మ్యాన్ అని నెమ్మదిగా అంటుంది. వీరికి చాలా దూరంగా వున్నా, బాబా వెంటనే తన చేతి సంజ్ఞలతో .. నో ..నో.. గాడ్ మ్యాన్ ... అని సూచించడంతో... లూయియీ భార్య హతాశురాలైందని, శ్యామ్‌జీ చెప్పారు.

బాబా పింపలగాం.. మెహెరాజాద్‌లో వున్న సమయమది. బాబా ఏకాంతవాసంలో వున్నారు. ఐతే, ఓ రోజున సమీప గ్రామం నుండి ఓ ముసలావిడ బాబా సోదరి మణిజాని కల్సి, తాను చనిపోయేలోగా అవతారుని దర్శనం చేసుకోవాలన్నది తన కోరికగా చెబుతుంది. ఐతే, బాబా ఏకాంతవాసంలో వున్నారు. ప్రస్తుతం కుదరదని, వున్న విషయాన్ని ఆ ముసలావిడకు చెప్పినా, ఆ వృద్దురాలు పట్టుబట్టడంతో, మణిజా ఆవిడకు ఓ సలహా ఇస్తుంది. అమ్మా.. నీవు రేపు ఉదయం ఫలానా సమయానికి ఇక్కడకు వస్తే, ఆ సమయంలో మేం బాబావారిని కుర్చీలో తీసుకుని మండలి హాలుకు తీసుకు వస్తాం. ఆ సమయంలో నీవిక్కడ ఉండగల్గితే, నీవు అవతారుడిని దూరం నుంచి దర్శించుకునే వీలుంటుందని చెప్పింది. అందుకు ఆమె అంగీకరించి వెనుతిరిగింది. అ మర్నాడు మణిజా చెప్పిన సమయానికి ఠంచనుగా మండలి హాలుకు ఎదురుగా దూరంగా వచ్చి నిలుచుంది. కానీ అవతారుడు మాత్రం ఆ రోజున తన గదిలోనుంచి వస్తూ, తన ముఖం చుట్టూతా తెల్లని గుడ్డను చుట్టుకున్నారు. అది చూసి ఆ వృద్దురాలు అయ్యో ముఖం కనపడకుండా వుందే అని బాధ పడుతున్న సమయంలో, సరిగ్గా ఆ ముసలామెకు దాదాపు ఎదురుగా రాగానే, బాబా ఏం చేశారనుకున్నారు.. తన ముఖాన్ని కప్పిన గుడ్డను తొలగించి, ఆమె వైపు క్రీగంట చూశారు. ఆమె ఆనంద పారవశ్యంతో, తన

కడపటి కోరిక తీరిన తృప్తితో వెనుతిరిగిందని, శ్యామ్‌జీ కడు రమ్యంగా చెప్పారు.

ఇలానే ఇంకో సంఘటనను వర్ణిస్తూ బాబా సర్కస్‌కి వెళ్ళిన వైనం వివరించారు.

బాబాతోపాటు మండలివారందరూ నగర్ నుండి పూనేకు బయలుదేరారు. మార్గమధ్యంలో చాంద్ అనే చిన్ని గ్రామం ఉంది. అ వూర్లో సర్కస్ కంపెనీ గుడారం వేసి ప్రదర్శనలు ఇస్తున్నారు. పదండి.. సర్కస్ చూద్దాం అన్నారు బాబా.

సర్కస్ ప్రారంభంలో గ్రామ సర్పంచ్ మెడలో గౌరవ సూచకంగా సర్కస్‌లోని ఏనుగుచేత పూలహారం వేయించే కార్యక్రమం ఒకటి ఏర్పాటు చేశారు. ముందు వరసలో బాబావారు, సర్పంచ్, తదితరులంతా ఆసీనులయ్యారు. సరైన సమయానికి వచ్చిన గజేంద్రుడు నేరుగా మెహెరుడున్న స్థానానికి వచ్చి, బాబావారి మెడలో తనతోబాటు తెచ్చిన పూలహారం వేసి చక్కాపోయింది. అందరూ జయజయధ్వానాలు చేస్తుంటే, వచ్చిన పని అయింది. ఇక వెళ్దాం పదండి అని, బాబా వారు తమ ప్రయాణ వాహనాల వైపుకి కదిలారు. ఆ గజేంద్రుడికి అవతారుడు ఆధ్యాత్మిక ఉన్నతిని కల్గించడానికే, ఆనాడు సర్కస్‌కు వెళ్ళి వుంటారని, శ్యామ్ పేర్కొన్నారు.

బుద్ధావతారంలో గౌతమునికి సంబంధించి ఒక సంఘటన గురించి శ్యామ్ కేరేవాలా చాలా చక్కగా ఇలా చెప్పారు. వారణాసిలో ఒక పేద బ్రాహ్మణుడు పూట గడవక నానా కష్టాలు పడుతూ జీవనం వెళ్ళదీస్తున్నాడు. అలా వుండగా ఓ రోజున కలలో – అయ్యా నీవు బుద్ధ గయకు వెళ్ళు. అక్కడ సిద్ధార్థుడు అనే బౌద్ధుడు వుంటాడు. నీవు ఆతడిని ఆశ్రయిస్తే నీ కష్టాలు గట్టెక్కుతాయని కలలో వినిపిస్తుంది. ఆ ప్రకారంగా బౌద్ధ గయకు చేరి, సిద్ధార్థుడిని దర్శించి, తాను వచ్చిన పని, తాను కన్న కల, కలలోని మాటలు అన్నీ సవివరంగా ఆయనకు చెప్పాడు. ఐతే, సిద్ధార్థుడు ఒక్కసారిగా భళ్ళున నవ్వి, చూస్తున్నావుగా, నా వేషం.. కాషాంబర వస్త్రధారుడిని. సన్యాసిని. నా దగ్గర ఏం దొరుకుతుందని ఆశిస్తున్నావని నవ్వుతూ అంటాడు. అదీ నిజమేనని నమ్మిన ఆ విప్రుడు తల వంచుకుని, వచ్చిన దారిన వెనుతిరుగుతాడు. ఇంతలో తనకేదో జ్ఞాపకం వచ్చిన ధోరణిలో ఆ బ్రాహ్మణుడిని వెనక్కి పిల్చి, అదిగో అల్లంత దూరాన గల నీళ్ళ దగ్గర ఒక రాయిని పెట్టివుంచాను. ఆ రాయికి మరోదైనా వస్తువు తాకితే బంగారం అయ్యే లక్షణం వుంది. అక్కడదాకా వెళ్లి ఆ రాయి దొరికితే తీసుకుని వెళ్ళు.. లాభపడు అని దీవించాడు సిద్ధార్థుడు. అలావెళ్ళిన బ్రాహ్మణుడికి, ఆ రాయి దొరుకుతుంది. తన ఇంటికి తీసుకెళ్లి భోగ భాగ్యాలతో, అమితమైన సుఖ సంతోషాలతో హాయిగా చాలా కాలం గడుపుతాడు. ఐతే కొంతకాలం అయ్యాక ఈ భోగ భాగ్యాలతో విసుగెత్తి, నిజమైన ఆనందం ఇచ్చే వీలు చూపమని తిరిగి సిద్ధార్థుడిని కలిసాడు ఆ బ్రాహ్మణుడు. సిద్ధార్థుడు అ విప్రుడిని తన





ఆశ్రమంలో చేర్చుకుని ఆతను కోరుకున్న ఆ నిజమైన అనందం ఆతనికి లభించేలా చేశాడు. అలా అష్టైశ్వర్యాలున్నా ఆ పండిట్‌కు నిజమైన అనందం దొరకలేదని, కేరేవాలా చమత్కారంగా చెప్పారు.

కేరేవాలా మేనమామ కూడా బాబా ప్రేమికుడే. ఆయన బాబా కోరినప్పుడు, బాబా ఎదుట హాఫీజ్ పద్యాలు పఠిస్తుండేవాడు. ఆయన బి.ఏ చదువుతున్నాడు. పరీక్ష రోజులు దగ్గరకొచ్చాయి. ఐతే ఓ రోజున బాబాతో, పరీక్ష తేదీలు వెల్లడించారు. ఇక రోజూ నీ దగ్గరకు రావడం తగ్గించి పరీక్షలకు తయ్యారవుతాను అన్నారట. అందుకు బాబా ఒప్పుకోలేదు. పరీక్ష రాసేటప్పుడు ముందుగా నా నామస్మరణ చేసి రాయడం మొదలుపెట్టు. పరీక్షల్లో నేను సహాయపడతాను అని బాబా భరోసా ఇచ్చారు. పరీక్షలయిపోయాయి. మార్కులు వచ్చాయి. అన్ని సబ్జక్టుల్లో ప్యాసయ్యాడు. ఒక్క దాన్లో మాత్రం పాసు మార్కుకూడా రాలేదు. ఐనా ప్యాసయినట్లు సర్టిఫికేట్ ఇచ్చారు. అదెలా సాధ్యం? ఇదే పెద్ద మీమాంశ చాలా మందికి. ఏమైందంటే, ఆ రోజుల్లో వైస్ – ఛాన్సలర్ తాను ఇష్టపడిన స్టూడెంటుకు ఐదు మార్కులు కలిపి ప్యాసు చేసే అధికారం వుండేది. అయితే, మా మేనమామకు అసలు ఆ వైస్ ఛాన్సలర్ ఎవరో కూడా తెలియదు. మా మేనమామ ఆ మాదిరిగా వి.సి.గారి కోటా మార్కులతో బి.ఏ. పాసయినట్లు సర్టిఫికేట్ ఇచ్చారు. ఆ సర్టిఫికేట్‌లో హీ ఈజ్ ఫెయిల్డ్ – బట్ పాస్‌డ్ అని రాసి వుంది. ఇదంతా బాబా దయవల్లనే జరిగిందని, ఈతరం వారికెవరికైనా చెబితే నమ్ముతారో లేదో నన్నట్లు ఆ బి.ఏ. సర్టిఫికేట్‌ను అందమైన గ్లాస్ ఫ్రేం కట్టించి మా ఇంట్లో వుంచామని నవ్వుతూ కేరేవాలా అన్నారు.

ఇంకా ఇలా ఎన్నో చిన్నిచిన్ని కథలుగా అవతారుని తన సాన్నిహిత్యం, ఆయన సందేశాలు చెప్పిన కేరేవాలా అఖరిగా ఒక చిన్న సూఫీ కథనం చెప్పారు. ఓ గ్రామం గుండా నది ప్రవహిస్తోంది. సూఫీ సద్గురువు తన శిష్యులతో నడుస్తూ అ నదీమ తల్లిని కీర్తిస్తూ.. .. అమ్మా నీవు అలా ప్రవహిస్తూ ఎందరికో దాహార్తిని తీరుస్తున్నావు. రైతులకు సాగునీరు, పరిశ్రమలకు కరెంటు, ఇలా ఎందరికో ఎన్నో సేవలు ఉచితరీతిన చేస్తున్నావు.. నీవు ధన్యురాలివి అని అంటాడు. అందుకు అ నది జవాబిస్తూ.. మీరనే మాటల్లోని గూడార్థం నాకైతే ఏమీ తెలియదు. నా దృష్టి, నా లక్ష్యం ఒక్కటే. తొందరగా వెళ్ళి మహాసాగరంలో కలిసిపోవాలన్నదే నా తొందర, నా అతృతా అని ఆ సద్గురువుతో అంటుంది. మనం కూడా మన జీవన లక్ష్యం ఆ సర్వేస్వరుడిలో ఏకమవడానికి పరితపించాలి. అనుక్షణం అవతారుని నామస్మరణలో గడపాలని, తరించాలని కేరేవాలా ముగించారు. అదే మన లక్ష్యం గమ్యం కావాలి.

## బాబా సందేశం

# స్వర్గం- నరకం

మేలుకొల్పుటకే కాని, బోధించుటకు రాలేదు అని అంటూనే. అవతార్ మెహెర్‌బాబా అనేక విషయాల గురించి మాట్లాడారు. మన దృష్టిని భగవత్ ప్రేమవైపు మళ్ళించడానికి ఎన్నో సంగతులు చెప్పారు. బాబా వారి మాటలు చాలా సరళంగా, పామరులకి సహితం అర్ధమయ్యేవిగా వుంటాయి. టీకా తాత్పర్యాల కోసం, నిఘంటువు వెతకాల్సిన పనిలేదు.

స్వర్గం, నరకం గురించి మాట్లాడుతూ, ఒకసారి బాబా, "ఇవి కేవలం మానసిక స్థితి. ఎక్కడో దూరంగా లేవు. మాయా ప్రపంచంలో అంతర్లీనంగా వున్న మరో మాయాజాలం" అని వ్యాఖ్యానించారు.ప్రాణం పోగానే ఏమౌతుంది? ఆత్మ శరీరాన్ని వదిలి పెడుతుంది. భౌతిక ప్రపంచంతో సంబంధం తెంచుకొంటుంది. ఆ స్థితిలో, మన సృహ, మన చైతన్యం, ఆత్మకి వుండవు. కానీ, భౌతిక ప్రపంచంలో ప్రోగైన సంస్కారాలు ఆత్మని వెన్నంటే వుంటాయని బాబా వివరించారు. ఈ సంస్కారాలు మాయం కావు సరికదా, సూక్ష్మ ప్రపంచంలో అభివ్యక్త మౌతాయని ఆయన చెప్పారు.

చావు, పుట్టుకల వలయం నుంచి బయటపడి, భగవంతునిలో జీవించగలగటమే నిజమైన మరణమని బాబా ఒకసారి సెలవిచ్చారు. చనిపోయిన ప్రతిప్రాణి మళ్ళీ వూపిరి పోసుకొంటూ ఉంటుంది. మరణానికీ, పునర్జన్మకీ మధ్య వున్న వ్యవధిలో, ఆత్మ దృష్టి, గతకాలపు సంస్కారాల వైపు మళ్ళుతుంది. ఇందువల్ల, ఆ సంస్కారాలకి మళ్ళీ ప్రాణం పోసినట్లవుతుందనీ, ఆ సంస్కారాల తాలుకు అనుభవాలకి కొత్త శక్తి వస్తుందని, బాబా అన్నారు. సంస్కారాల వలయంలో చిక్కుకొన్న సగటు బడుగు జీవికి, సూక్ష్మ ప్రపంచపు ఉనికి, ఆ ప్రపంచపు లోతుపాతులు, అక్కడి ఆటుపోటులు సహజంగానే తెలియవు .

### మానసికావస్థ

సజీవంగా ఊపిరిపీలుస్తూ భూమి మీద జీవిస్తున్నప్పటి కంటే, మరణానతరం, కష్ట సుఖాల ప్రభావం, ప్రాణిపై ఎక్కువగా వుంటుందని బాబా అన్నారు. ఈ స్థితిలో కష్టాలు తెచ్చే బాధ కొంచెం ఎక్కువగానే వుంటుంది. అలానే, ఆనందం తెచ్చే మధురానుభూతి మహా హాయిగా వుంటుంది. ఈ మానసికావస్థలే, అంటే కష్టాల ప్రహేళి, ఆనందాల రవళి, మనమనుకొనే నరకం, మనం వూహించుకొనే స్వర్గం అని బాబా స్పష్టం చేశారు.





ఈ స్వర్గ, నరకాలు వాస్తవికంగా ఎక్కడో వున్నాయని భావించవద్దని ఆయన హెచ్చరించారు.

అవతార పురుషుడు మరో మాట సెలవిచ్చారు. బాహ్య చైతన్యంలో వున్నప్పటికంటే, నరకావస్థలో, స్వర్గావస్థలో వాంఛలు కొంచెం ఘాటుగా వుంటాయన్నారు. ఈ కోర్కెలు నెరవేరినా, నెరవేరక పోయినా, కలిగే "అనుభూతి" కూడా కొంచెం ఎక్కువ మోతాదులోనే వుంటుందని బాబా అన్నారు. భౌతిక ప్రపంచంలో ఆత్మ చైతన్యం శారీరక అవసరాలతో అనుభవాలతో ముడిపడింది. ఇవి ఆత్మ పరిణామక్రమానికి అవరోధం కల్గిస్తాయి. ఈ అవరోధాలనే ఆత్మకి వేసిన మరో ముసుగు అని బాబా అభివర్ణించారు. ఈ ప్రక్రియ వల్ల ఏమౌతుంది? అనుభూతల చైతన్యం తగ్గుతుంది. ఏ ప్రకారంగా అంటే, టార్చిలైట్ వేశారనుకోండి. కాంతిపుంజం వెలుతురు వెదజల్లుతుంది. ఆ కాంతి కిరణాలు మందంగా వున్న గాజు పాత్ర ద్వారా ప్రసరిస్తే, వాటి కాంతి తగ్గుతుంది కదా...అలాగన్నమాట. భౌతిక శరీరపు ముసుగు అనుభూతుల కాంతిని తగ్గిస్తుందన్నారు బాబా.

### పుడమిపై స్వర్గం

స్వర్గావస్థలో వాంఛలు నెరవేరడానికీ, సశరీరంగా వున్నప్పుడు కోర్కెలు తీరడానికీ ఎటువంటి పొంతనా లేదని బాబా చెప్పారు. ఇది ఎలాగ? మంచి సంగీతం వినాలనిపించదనుకోండి. మనం ఏం చేస్తాం? సంగీతం వినే ప్రయత్నం చేస్తాం! అవునా! స్వర్గావస్థలో అలాకాదు. సంగీతం వినాలన్న కోర్కె పుట్టిన వెంటనే, సంగీతం వింటున్న మధురానుభూతి కలుగుతుంది. మాటలకీ, ఊహకీ అందని మానసికానందం అది. ఈ స్థితిని, బాబాగారి మాటల్లో చెప్పాలంటే, వాంఛలకీ, వాంఛలు నెరవేరడానికీ, మధ్య స్వర్గావస్థలో ఎటువంటి అడ్డంకులూ వుండవు. కోరిన వెంటనే అన్నీ అనుభవంలోనికి వస్తాయి. కొంతమంది అదృష్టవంతులు వుంటారు. వాళ్ళు, మనలా, బాహ్య చైతన్యంలో వుంటూనే సూక్ష్మ ప్రపంచపు సువాసనలని ఆస్వాదించగలరు. అదొక అంతీంద్రియ శక్తి. పాశ్చాత్య సంగీత వాగ్గేయకారుడు బీథోవెన్ సంగతే తీసుకోండి. పుట్టుకతో చెవిటివాడు. కానీ, మధుర స్వరాల రచన చేశాడు. సంగీత ఝరిలో తేలియాడిన అమరమూర్తి ఆయన.

చెవిటివాడు సంగీతం ఎలా వినగలడు? ఈ ధర్మ సందేహం సహజమే, కానీ బీథోవెన్ సాధించింది- పుడమి పై స్వర్గం అన్నారు బాబా. ఇదే ప్రకారంగా, ప్రేమ మూర్తి భగవంతుడిని ఆరాధించే వ్యక్తికి, ఆ దైవం కళ్ళ ముందు సశరీరధారిగా కన్పించనక్కర్లేదు. కేవలం భగవన్నామ స్మరణతోనే భగవతోన్మత్తుడు కాగల ధన్యజీవి అతడు. మంణానంతరం, స్వర్గావస్థలో, ఈ ఊహాజనిక వాంఛాసిద్ధి అమోఘమైంది. దానికి భౌతిక శరీరపు ముసుగు బాధలేదు.

**వాంఛలు- మంచీ, చెడూ**

వాంఛలు, వాటి తీరు తెన్నుల గురించి కూడా బాబా ప్రస్తావించారు. కొన్ని రకాల వాంఛలు శారీకమైనవి. బకాసురిడిలా తిండి యావ, తుచ్ఛ శారీరక వాంఛ, తనివితీరా సారా త్రాగాలన్న కోర్కె- ఈ జాబితాలోకి వస్తాయి. వీటిపై ఒకసారి మనస్సు మళ్ళితే, అవి లభించేదాకా శాంతి వుండదు. ఈ వాంఛలు భౌతికపరమైనవనీ, నైతికమైనవి కావనీ, మానసిక పరిపక్వతకి సంబంధించినవి కావనీ వేరే చెప్పాలా! సంగీత రసాసాధన చేయాలన్న కోర్కె ఇటువంటిది కాదు. రాగం, తానం, పల్లవి అవసరమే. చెవులారగ వినాలి. కానీ, అది డప్పుల మోత కాదు. సంగీతం ద్వారా వ్యక్తమయ్యే ఆనందం. ఈ అనుభూతిని వర్ణించడానికి బాబా మరో ఉదాహరణ ఇచ్చారు. అది పురాణ కాలక్షేపం వల్ల కల్గే మధురస్మృతి. పురాణ శ్రవణం వల్ల శారీరకానందం కంటే, అనూహ్యమైన మానసికానందం కలుగుతుంది కదా. మరో మాటలో చెప్పాలంటే, మంచి వాంఛల వల్ల కలిగే తృప్తి, ఆనందం, శారీరకం కాదు. మానసికం. చెడ్డ వాంఛల్లో ఇలా కాదు కదా! ఆ అనుభూతి భౌతికం. ఆ వాంఛ నెరవేరితేనే తృప్తి. తద్వారానే, ఆత్మకి (భౌతిక శరీరంలోని) తన ఉనికి తెలిసివచ్చేది.చెడ్డ వాంఛల్లో మరో ప్రత్యేకత వుంది. వీటి గురించిన ఆలోచనే, ఆ వాంఛని రెట్టింపు చేస్తుంది. సూక్ష్మ శరీరంలో ఈ వాంఛలు తీరవు కాబట్టి అసంతృప్తి పెరుగుతుంది. నరకం ప్రత్యక్షమౌతుంది.భౌతిక ప్రపంచంలో మాదిరిగా, సూక్ష్మ ప్రపంచంలో కూడా, చెడ్డ వాంఛలు కష్టాలకి దారితీస్తాయి. మంచి వాంఛలు సుఖ సంతోషాలని తెస్తాయి. స్వర్గాన్ని అనుభవింపజేస్తాయి అని బాబా అన్నారు.

**ఎన్ని రోజులో!**

స్వర్గావస్థ, నరకస్థితి శాశ్వతంగా వుండవని బాబా పేర్కొన్నారు. వీటి వ్యవధి, మన సంస్కారాలని బట్టి వుంటుందన్నారాయన. ఐతే, చిక్కల్లా, మన గడియారాలు, సూక్ష్మ ప్రపంచంలో పనిచేయవు కాబట్టి, ఈ వ్యవధి ఇంతకాలం వుంటుందని ఇదమిద్ధంగా చెప్పలేం. బాబావారి మాటల్లో చెప్పాలంటే మన సంస్కారాలు ఈ టైమ్‌ని నిర్ధారిస్తాయి.

మరొకమాట. కామం వంటి చెడ్డ కోర్కెలు, వాటివల్ల కలిగే కోపతాపాలు, ఈర్ష్యాద్వేషాలు మనల్ని మాయ అనే వూబిలోకి త్రోసేస్తాయి. నరకంలోని కష్టాలని తెస్తాయి. మరి, మంచి ఆలోచనలు, మంచి ఆశయాలు, కళా హృదయం, సౌహార్ద్రభావం, పరోపకార బుద్ధి, మనోవికాసానికి పునాది వేస్తాయి. స్వర్గంలోని సుఖాలని మనమందుంచుతాయని బాబా అన్నారు.

**“చేసుకొన్న వారికి చేసుకొన్నంత మహదేవా”** అన్నట్లు భౌతిక ప్రపంచంలో, అంటే, ప్రాణాలతో వున్నప్పుడు, మనం ప్రవర్తించిన తీరు, మనల్ని స్వర్గానికి తీసుకువెళ్ళవచ్చు.





నరకావస్థ లోనికి తోయవచ్చు. ఈ దశ చాలావరకు. (చాలామంది విషయంలో), ప్రాణాలతో వుండగా చేసిన పాప పుణ్యాల బట్టి వుంటుంది. భూమి మీద వదిలిపెట్టిన సంస్కారాల అనుభవాలపై ఆధారపడి వుంటుంది. శరీరంతో వుండగా ఎదురైన అనుభవాల స్వరూప స్వభావాలను బట్టి సూక్ష్మ శరీరంలో అనుభవించాల్సిన కష్టసుఖాలుంటాయని బాబా పదే పదే చెప్పారు.

**నీడ- అంతం**

చక్కగా రికార్డు చేస్తే కదా, గ్రామఫోన్‌లో పాట చక్కగా వినిపించేది. రికార్డు మీద గీతల్లో తిరిగి తిరిగి, ముల్లు ఆగిపోతే, పాట ఐపోయిందనే కదా అర్థం. అలానే, స్వర్గ, నరక దశలు, భౌతిక ప్రపంచంలోని అనుభవాల స్మృతి అయిపోయే దాకా వుంటాయని బాబా అన్నారు. ఈ లోకంలో మనం గడిపిన జీవనసరళి, దృక్పథం, మరణానంతరం, ఆత్మ ప్రయాణ మార్గాన్ని నిర్ధాయిస్తాయని ఆయన అన్నారు. ఈ దృష్ట్యా చూస్తే, మన స్వర్గం, మన నరకం, మన జీవితపు నీడ అనవచ్చు. ఆత్మ, సూక్ష్మ శరీరంలోకి అడుగుపెట్టాక ఏం జరుగుతుంది? బాబా వారు ఈ విషయాన్ని ఒకసారి విశ్లేషించారు. ప్రాణంతో వున్నప్పుడు పూర్వాపరాలని నిర్మొహమాటంగా పర్యావలోకన చేసి, పరిస్థితుల కనుగుణంగా సంచరించే శక్తి మనిషికి వుంటుంది. పాత సంస్కారాల ప్రభావం ముందుకు తోస్తాయి. కానీ, మరణానంతరం, ఈ శక్తి కొరవడుతుంది. కేవలం భూమిపై జరిగిన ఘట్టాలనీ బేరీజు వేసుకొనే సామర్థ్యం మాత్రమే వుంటుంది. అదీ తీరుబాటుగా చేసే వెసులు బాటు వుంటుంది.

**మనో ఫలకం**

గతావలోకనం చేస్తుంటే, ఆయా సంఘటనలన్నీ, మనో ఫలకంపై, వెండితెరపై బొమ్మలా, దోబూచులాడుతూ పరుగెడుతాయి. చిరస్మరణీయమైనవిగా మిగిలిపోతాయి. ఇందువల్ల ఏమౌతుందంటే, ఈ జ్ఞాపకాల దొంతర, కొత్త జన్మకి స్ఫూర్తినిస్తుంది. నరకస్థితి, స్వర్గదశ, కొత్త జన్మకి పునాది రాళ్ళవుతాయి. అలా అని, ఈ గత జలసేతు బంధనం, కేవలం పాతకాలపు సువాసనలు, గుర్తులు కావు. కాచిపోసిన అనుభవాలసారం మాత్రమే. దీశక్తికి, ధారణశక్తికీ, బుద్ధికీ మారుపేరు. కొత్త జీవితానికి పెట్టుబడి. ఇది ఒక్కొక్కరికి ఒక్కో రకంగా వుంటుంది. భూమిపై జీవితానుభవం, మరణానంతరం కలిగే నేర్పు, వోర్పు, మేలిమి, సృష్ట్యాదిగా మనలో దాగి వున్న విజ్ఞాన సంపదను వెలికితెస్తాయి.

ఇహలోకంలో మన జీవన సరళి, అనుభవాల మాదిరిగా, నరక, స్వర్గావస్థలు, ఆత్మ ప్రయాణంలో భాగమేనన్నారు బాబా. ఆత్మ ఆశించేది ఏమిటి?సర్వాంతర్యామిని చేరుకోవటమే కదా! పునరపి జననం ..పునరపి మరణం- ఈ చావు పుట్టుకల ప్రక్రియ, ఆత్మ సర్వాంతర్యామిలో లీనమయ్యే వరకే కదా!

# ఇదే నా విధానం



1949 ఫిబ్రవరి 12, శనివారం.

మెహెరాబాద్‌లో బాబావారి 55వ జన్మదిన వేడుకలు జరుపుతున్నారు.

బాబా ముందుగానే తన మండలి వారిని, పెండూ తదితరులతో "రాబోయే రోజులు చాలా గడ్డు రోజులు. ఖర్చు అధికంగా వుండొచ్చు. రేపు ఎలా వుంటుందో తెలియదు. కాబట్టి చాలా పొదుపుగా ఖర్చు చేయాలని హెచ్చరించారు.

అంతేనా– నాతో వుండదల్చిన వారు– ఇక్కడ వుండండి.

లేదంటే హాయిగా వెళ్ళిపోండి అనీ అన్నారు.

ఆధ్యాత్మిక ప్రగతికి గాని Material welfare కోసం నా నుండి ఏమీ ఆశించ వద్దన్నారు. ఆకలితో అలమటించడానికైన సిద్దపడివాళ్ళే ఇక్కడ వుండండి.

లేని పక్షంలో దయచేయొచ్చని, నిక్కచ్చిగా తాను చెప్పదల్చుకున్న రెండు మాటల్ని బాబా స్పష్టంగా చెప్పారు.

సుమారు ఓ గంటకు పైగా బాబా మండలివారు పొదుపు ఎలా పాటించాలనే విషయమై విశేష ప్రసంగం చేశారు.

ఆ రోజున నాసిక్ నుండి ఓ కొత్త వ్యక్తి బాబా దగ్గరకు వచ్చాడు. ఆతను కూడా పొదుపు విషయమై బాబా చెప్పిన మాటలన్నీ విన్నాడు.

ఆ దరిమలా బాబాతో ఆ వ్యక్తి ఏకాంతంగా కలిసాడు.

తన బాధలేవో బాబావారి ఎదుట వెళ్ళబోసుకున్నాడు.

అవన్నీ ఆలకించిన అవతారుడు, బాబావారి కార్యదర్శి ఆదీ సీనియర్‌ని పిల్చి, ఆ నాసిక్ నుండి వచ్చిన వానికి వెంటనే ఐదు వందల రూపాయలు విరాళంగా ఇచ్చి పంపమన్నారు. ఈ మాటలు వింటున్న ఆదీ అవాక్కయ్యాడు. ఒక్క రూపాయి ఖర్చు చేయడానికి వీలు లేదు అంటూ – పొదుపు మంత్రం చెప్పిన బాబా ఏమిటి– ఇలా రు. 500/– విరాళం ఇమ్మంటున్నారని సందేహంలో పడటం ఆదీ వంతైంది.

తేరిపార చూస్తున్న ఆదీతో– ఇదంతా నీకు అర్ధంకాదు!!

ఇదే నా విధానం!! అని బాబా స్పష్టం చేశారు!!

*( లార్డ్ మెహెర్ వాల్యూం–V )*





# GO TO HELL

1949 అక్టోబరు 30.

మెహెర్‌బాబా మెహెరాజాద్‌లో వున్నారు. ఆదీ సీనియర్, ధాకే, మనేకర్ తదితరులంతా బాబాని కలిసేందుకు సాయంత్రం పూట మెహెరాజాద్‌కు వెళ్ళారు. Death & Immortality – అనే అంశంపై బాబా చెప్పిన సందేశాన్ని టైపు చేసేందుకై తనతో పాటు తీసుకెళ్ళిన టైపు రైటర్‌ని వాపసు ఇచ్చేందుకై ధాకే మెహెరాబాద్ వచ్చాడు. ధాకే ఇచ్చిన బాబా సందేశాన్ని డా|| ఘనీకి ఇస్తూ, దానిని జాగ్రత్తగా బధ్రపరచమని– తిరిగి చూడొద్దని ఆతడిని బాబా ఆదేశించారు. **ఒక వేళ చూస్తే– మరణం తథ్యం** అని ఛలోక్తిగా బాబా అన్నారు. డా|| దేశ్‌ముఖ్, రమ్జూ, బాలనాటు కూడా ఆ సమయంలో బాబాతో వున్నారు. ఇంతలో బాబా వారందరినీ ఉద్దేశించి, ఈ చిక్కుముడి విప్పండని, సరైన జవాబు ఇవ్వమని అన్నారు.

నేను సర్వజ్ఞునిడిని. నేను అంతటా – అన్నింటా వున్నాను. ఐనప్పటికీ, నాకు ఒక్కటి మాత్రం తెలియదు. అదేమిటి? ("Even though I am all knowing and I am in everything, there is one thing that I do not know. What is it? ) అని ప్రశ్నించారు.

దేశ్‌ముఖ్ వెంటనే– బాబా నీవు అంతటా వున్నావు. అన్నింటా వున్నావు. అనంత జ్ఞానివి. త్రికాలవేదివి. నీకే తెలియకపోతే, సామాన్యులమైన మాకు ఏం తెలుస్తుంది– అని వినమ్రంగా అన్నాడు. అందుకు బాబా ఏమన్నారంటే–

నేను లేనటువంటి స్థానం ఏమిటో నాకు తెలియడం లేదని' ("I do not know where I am not") అని బాబా సూక్ష్మంగా జవాబిచ్చారు. వెంటనే ఇక్బాల్ కవిత నొకదాన్ని ఉటంకిస్తూ– డా|| ఘనీ ఇలా అన్నారు. I am not afraid of hell because I am told, O God, that you are also there" ఓ భగవంతుడా !! నాకు నరకం అంటే భయమే లేదు. ఎందుకంటావా– నీవు అక్కడ కూడా ఉన్నావని నాకు చెప్పారు. అని అన్నాడు. సరే! ఇక అందరం నిష్క్రమిద్దామని బాబా సంజ్ఞ చేశారు.

ఐతే, ధాకేజీ ఊరుకోవచ్చా– లేదే... మరేదో చెప్పబోయాడు.

దాంతో బాబా ధాకేని వారిస్తూ – ఇక చాలు, చాలన్నారు.

Get out and Go to hell!! I am waiting for you there !!

అని చమత్కరించారు. అందరూ భళ్ళున నవ్వుకున్నారు.

*( లార్డ్ మెహెర్ వాల్యూం–V )*

# మధుర గాయకులు
# మధుసూధన్, సుభద్ర



Mr. Madhusudan Avatar Meher Baba Mrs. Subhadra

పూనే సెంటర్ బాబా భజన బృందం మెహెర్‌బాబాకు చాలా సన్నిహితంగా వుండేది.

ఈ భజన బృందం 1948 ప్రాంతంలో శ్రీ లక్ష్మీకాంత్ థాడే ఇంట్లో తరచు కలుసుకుని మెహెర్‌బాబా గీతాలు ఆలాపిస్తుండేవారు. బాబా ఆదేశాల ప్రకారం, అనేక మార్లు బాబా ఎదుట ఈ బృందం అనేక గీతాలు ఆలాపించింది.

ఈ బృందంలో ప్రధాన గాయకులు శ్రీ మధుసూధన్, ఆయన భార్య సుభద్ర అని చెప్పుకోవాలి. సుభద్ర సాంప్రదాయ సంగీతం నేర్చుకుంది. మధుసూధన్, సుభద్రలు పూనే భజన బృందం తరపున గురుప్రసాద్‌లో బాబా ఎదుట చాలాసార్లు పాటలు పాడారు. మధుసూధన్, సుభద్రలకు మెహెర్‌బాబానే స్వయంగా 1959 మే 14న (గురుప్రసాద్‌లో) వివాహం జరిపించారు. ముందుగా వారిద్దరూ ఒకరిపట్ల మరొకరు ఇష్టపడ్డారు. వీరి వివాహానికి, వారి ఇంట్లో తల్లితండ్రులు ఒప్పుకోలేదు. పూనే భజన బృందమే ఈ విషయంలో చొరవ తీసుకుని, బాబాకు ఈ విషయం తెలియజేసి వారి వివాహం జరిపించారు. వీరి వివాహానికి బాబా ఒక శాలువా బహుకరించారు. ఆ శాలువాను మెహెర్‌బాబాకు సాకోరీ ఉపాసనీ మహారాజ్ బహుకరించింది.

బాబా ప్రేమికులు గాడేకర్, థాడే, ప్రతాప్ ఆహిర్ తదితరులు పెళ్ళి బహుమతులు అందజేశారు.

మధుసూధన్ శ్రీధర్ పుండ్. 1927 జూలై 10న మహారాష్ట్ర లోని సతారా జిల్లాలో హాద్‌గోఘర్ అనే చిన్ని గ్రామంలో జన్మించారు. పాఠకులకు తెలుసు, మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి మౌనం ప్రారంభించారు. బాబా ప్రేమికులకు జూలై 10





అత్యంత ప్రధానమైన రోజు. అలాంటి పవిత్ర దినాన మధుసూధన్ జన్మించడం ఆతని పూర్వజన్మ సుకృతం అని బాబా ప్రేమికులు భావిస్తారు.

మధుసూధన్ తండ్రి శ్రీధర్‌రావు మహారాష్ట్ర ప్రభుత్వ అటవీ శాఖలో ఓ చిన్న ఉద్యోగి. ఉద్యోగ రీత్యా పూనేకు బదిలీపై వచ్చారు. అలా వచ్చిన రెండేళ్ళకే మధుసూధన్ తండ్రి, పెద్ద అన్నగారూ ఇద్దరూ అకస్మాత్తుగా ఒకరి తర్వాత మరొకరు మరణించారు. కుటుంబ భారం మధుసూధన్‌పై పడుతుంది. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, మధుసూధన్ పెద్దగా ఏమీ చదువుకోలేదు. రాత్రి తరగతులలో నాల్గవ ఫారం దాకా ఎలాగో చదువు పూర్తి చేసుకుని, పూనేలో అనేక చోట్ల చిన్నా చితక ఉద్యోగాలు చేసి, అనంతరం, పూనే లోని బి.జె. మెడికల్ కాలేజీలో లాబ్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాడు.

క్రమేణా బాబా గురించి తెలుసుకుని, బాబా భజన బృందంలో అందరితో కలిసి పాటలు పాడుతుండేవాడు. మధుసూధన్ గళం గురించి ప్రత్యేకంగా చెప్పాలా? అద్భుతమైన గాత్ర మధుర్యం ఆయన సొంతం. పూనే భజన బృందం ద్వారా- పాటలు పాడుతూ క్రమేణా బాబావారికి సంపూర్ణంగా అంకితమయ్యాడాయన. ఒకసారైతే, రమారమిన 9 గంటలుపైగా ఏకబిగిన బాబా ఎదుట మధుసూధన్ బృందం పాటలు పాడింది.

మధుసూధన్ గొప్పగా పాటలు పాడే మధుర గాయకుడే కాదు, అంతకుమించి, గొప్ప రచయిత కూడా. శ్రీ మధుసూధన్ 300 పైగా భజన గీతాలు హిందీ, మరాఠీ, ఇంగ్లీషు భాషలలో రాశాడు.

అది 1948 - 1951 కాలంనాటి మాట. మధుసూధన్‌కు 21 సంవత్సరాల వయస్సు ఉండేది. ఆ రోజుల్లో పూనే సెంటర్‌కు బాబా ప్రేమికులు, బాబాకు సన్నిహితుడు, చిన్ననాటి మిత్రుడైన డా॥ ఘనీ- తరచు వీరి సెంటరుకు వచ్చేవారు.

బాబా సందేశాలపై డా॥ ఘనీ అనర్గళంగా, కొన్ని గంటలసేపు ప్రసంగించేవారు. ఒకదఫా, బాబా సందేశాలపై డా. ఘనీ ప్రసంగం 18 గంటలు పైగా కొనసాగింది.

శ్రీ ఎల్.బి.థాడేకు పూనేలో చాలా విశాలమైన గవర్నమెంట్ క్వార్టర్సు వుండేది. డా॥ ఘనీ పూనే వస్తే థాడే గారి ఇంట్లోనే ఆయన బస వుండేది.

డా॥ ఘనీ గారి ఉపన్యాసాలు విని విని మధుసూధన్ ఆయన మాటలల్లోని బాబా సందేశాలపై చక్కని గీతాలు రాయడం అలవరచుకున్నాడు.

ఆ దరిమలా బాబావారి సూచనలపై, మధుసూధన్ ఎన్నో గీతాలు రాసి ఆయన ఎదుట ఆలాపించే అవకాశం లభించింది. ఓ సందర్భంలో బాబా మధుసూధన్‌ని 7 పాటలు ఏకధాటిన రాయమన్నారు. పాటలు రాసేటప్పుడు, ముందుగా చాలా సందర్భాలలో బాబానే స్వయంగా మధుసూధన్‌కు అనేక సూచనలు చేశేవారు.

ఓ సారి 1954 లో బాబా గాడ్గే మహారాజ్ ఆహ్వానం మేరకు, కార్తీకమాసం, ఏకాదశి పర్వదినాన పండరీపూర్ వెళ్ళారు.

ఆ పండుగ రోజున లక్షలాది భక్త సందోహం పండరీపూర్ వస్తారు.

ఆ సమయంలో బాబా మధుసూధన్‌ని పిలిచి ఓ కొత్త పాట పాడమన్నారు.

అంతే, అలా ఆ సమయంలో చేతికి చిక్కిన కాగితం, ఎదుటివాని జేబులోంచి పెన్ను తీసుకుని అవలీలగా రాసిన గీతమాల .. **అహో- అలా- పహదేవ్ ఆలా -**

**ఓ హెూ- భగవంతుడు వచ్చాడు. రండి. అందరూ వచ్చి దర్శించుకోండనే** అర్థం వచ్చేలా-ఓ మధుర గీతాన్ని అప్పటికప్పుడు రాసి, బాణి కట్టి- బాబా ప్రేమికుల హృదయతంతువులపై సుతారంగా మీటాడు, మధుసూధన్. ఎంత అద్భుతమైన గీతమిది. ఆపాట వింటుంటే హృదయం ద్రవిస్తుంది. మీకేమైనా అవకాశం లభిస్తే ఎప్పుడైన ఓ సారి ఈ పాటను పాడించుకుని ఆలకించే ప్రయత్నం చేయండి.

ఈ గీతం విని బాబా ఎంతగానో సంతోషించారు. దాంతో, నీవు రాసిన పాటలతో పుస్తకం ఏమైనా ప్రింట్ చేయించావా? అని బాబా మధుసూధన్ అడిగారు.

**లేదు** – బాబా అని మధుసూధన్ చెప్పగానే, బాబా కార్యదర్శి, శిష్యుడైన ఆదీ-కె-ఇరానీ పిలిచి, మధుసూధన్ పాటల పుస్తకం అచ్చువేయించమని బాబా ఆదేశించారు. ఆ మాదిరిగానే 1955లో మధుసూధన్ పాటలు పొత్తం తొలిసారిగా **'మెహెర్‌గీత్ ధారా'** పేరుతో ప్రచురితమైంది.

మధుసూధన్ రాసిన పాటలు స్వచ్ఛమైనవి. వాటిల్లో తప్పొప్పులు పేరిట వేలెత్తి చూపే ప్రయత్నం ఎవరూ చేయొద్దనీ అవతారుడు తన ప్రేమికుల్ని- హెచ్చరించారు.

మధుసూధన్ పాటలే కాదు – **'రహెనుమా'** పేరిట నాటికను కూడా రాసి బాబా ఎదుట ప్రదర్శించారు. ఈ నాటికలో బాబా ప్రేమికులు సోరబ్ రుస్తుంలు- మెహెర్‌బాబా – ఏరుచ్ పాత్రలు ధరించి అద్భుతంగా నటించారు. సో॥ మణి ఈ నాటికకు దర్శకత్వం వహించారు. ఈ నాటిక చూస్తున్నంత సేపు- అవతారుడు తన ఆనందాన్ని- ఆవేశాన్ని అదుపు చేసుకోలేక కళ్ళంబడి కారే ఆనందభాష్పాలను తుడుచుకుంటూ తన కళ్ళపై చేతి రుమాలు వుంచుకున్నారని అనాటి పెద్దల రాతల వల్ల తెలుస్తుంది. అంతేకాదు, ఆనాడు అవతారునికి తీసిన ఫోటోలు సాక్షీభూతంగా నేడు మనందరికీ అందుబాటులో వున్నాయి.

1968 సెప్టెంబర్ 13న మెహెర్‌బాబా మధుసూధన్‌ను మెహెరాజాద్‌కు ఆహ్వానించారు. ఆ రోజున బాబా మధుసూధన్‌ని తన దగ్గరగా పిల్చి, సుభద్ర -పిల్లలు ఎలా వున్నారని ప్రేమగా వాకబు చేశారు.





ప్రేమావతారుడితో ఆఖరిసారిగా నేను మాట్లాడిన క్షణాలవని మధుసూధన్ అన్నారు.

**ఆరతి- జహా- కల్పనా-**

1952వ సంవత్సరం. ఓ రోజున మధుసూధన్‌ని మెహెరాబాద్‌కు రమ్మనమని బాబా కబురు పంపారు. అలా వెళ్ళిన వానితో – నీ పేరేమిటి? అని అడిగారు.

ఆశ్చర్యపడ్డాను. నా పేరు 'మధుసూధన్' అని చెప్పాను.

నా పేరు మెహెర్‌బాబా. నీ పేరు మధుసూధన్. నీవూ – నేనూ చాలా భాగం ఒకేలాగా వున్నాం కదా? ఈ రెండు రకాల పేర్లు ఏమిటి? అని ప్రశ్నించారు.

ఈ పేర్లు మన మనస్సుకు సంబంధించిదని బాబా తిరిగి ఆయనతో అన్నారు.

**"మనస్సు" అంటే ఏమిటి?** అని మరలా ప్రశ్నించారు. గత జన్మ సంస్కారాలతో నిండిన ఒక భండాగారం 'మనస్సు'. నేను ఈ ప్రపంచాన్ని సృష్టించాను. కానీ సంస్కారాలను మాత్రం నీవే సృష్టించుకున్నావు అని అన్నారు. నాకు నా ప్రేమికులు ఆరతి యిస్తారు. ఆ ఆరతిలో వారి మనస్సు నాకు అర్పించాలని నేను కోరుకుంటాను. ఐతే, నాకిచ్చే ఆరతిలో వారు – ఒక్క మనస్సును తప్పించి, సమస్త సృష్టిలోని వస్తువులను, విషయాలన్నింటినీ ప్రస్తావిస్తారని బాబా అన్నారు.

అవతారుని సూచనల మేరకు... మధుసూదన్ హిందూస్తానీ తోడి రాగం, ఆది తాళంలో 'జహా కల్పనా' ....."మెహెర్ మన్ ఆరతి స్వీకారో" అని ఆరతి రాసి అవతారుని ఎదుట ఆలాపించారు. బాబా ఆమోదం తెలిపాక, అవతారుని ప్రేమికులకు ఆ ఆరతిని అంకితమిచ్చారు.

ఈ ఆరతిని 1960లో బాబా గురు ప్రసాద్‌లో వున్న సమయంలో తొలిసారిగా మధుసూధన్ దంపతులు- బాబా ఎదుట గానం చేశారు. ఆనాడు బాబా వారి చేత ఈ ఆరతిని ఏడు సార్లు పాడించుకున్నారు. వారు ఆరతిని ఆలాపించే సమయంలో బాబా తన రెండు చేతులు జోడించి నిలబడే వున్నారు. నిజామాబాద్ సెంటర్ బాబా ప్రేమికులు శ్రీ రెంటాల ఈ ఆరతిని హెచ్.ఎం.వి. గ్రాం ఫోన్‌లో రికార్డు చేయించి, ఆ రికార్డులను బాబా ట్రస్టుకు అంకితమిచ్చారన్న సంగతి పాఠకులకు విదితమే..

మధుసూదన్ తాను ఏది రాసినా- ముందుగా బాబాకు చూపించి, ఆయన ఆమోదం లభించాకనే బాబా ప్రేమికుల ఎదుట ఆలాపించేవారు.

మెహెరుడు మెచ్చిన గొప్ప గాయకుడు, కవి, మధుసూధన్ ...

బాబా ఇచ్చు ప్రకారం

కడదాకా నడుచుకున్న ధన్యజీవి. ❀



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చురీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

మా తప్పు క్షమించమని మనస్సులోనే వేడుకొన్నారు. ఆవేళ్టి నుంచీ, బాబావారి కోసం అన్నం వేరే వుంచేవారు. రాత్రయినా సరే పిలుపు రాలేదు కదా అని ఎవరూ ముట్టుకొనేవారు కాదు.

జూన్ 23వ తేదీన గడేకర్ పూనా వెళ్ళాడు. అతగాడి చదువు ఇహపైన పూనాలోనే చేస్తాడట. ఆ వేళ రోజంతా బాబా వారు ఏకాంతంలోనే వున్నారు.

ఆ మర్నాడు, అంటే జూన్ 24వ తేదీన బాబా ఉదయం ఆరింటికి లేచారు. బయట ఎవరూ లేరు. సరికదా మొహం కడుక్కోటానికి నీళ్ళు కనబడలేదు.

చాలా కోపం వచ్చింది.

క్యాబిన్ బయట కాపలా పని జాల్‌ది.

ఇక్కడి నుంచి కదిలి వెళ్ళకు అని చెప్పారు. అయినా మనిషి గల్లంతు అయ్యాడు.

తమ్ముడు అయితేనేం, ఆజ్ఞ ధిక్కరిస్తే ఎలాగ?

బాబాకి అందరూ ఒక్కటే కదా! కొంచెం గట్టిగానే చివాట్లు పెట్టారు. జాల్‌నే కాదు. మండలి అందరికీ పడ్డాయి చురకలు.

నేనంటే మీకెవరికీ శ్రద్ధలేదు. నా అవసరాలు గుర్తించడం లేదు.

సరేకానివ్వండి. నాకెవరి సాయం అక్కర్లేదు. నా పనులు నేను చూసుకొంటాను. మీరు ప్రగల్భాలు పలుకుతారు. స్వంత డబ్బా కొట్టుకొంటారు. నా శిష్యులమని చెప్తారు. కానీ శ్రద్ధగా, బుద్ధిగా చెప్పిన ప్రకారం పనిచేసే వారెవరు.

నన్ను సేవించడం పోయి నాకు తలపోటు తెస్తున్నారు అంటూ వో హెచ్చరిక చేశారు. బాగా విసిగిపోయాను. మీరంటే జుగుప్స, అసహ్యం వేస్తున్నాయి. ఎప్పుడో ఒక రోజున చెప్పాపెట్టకుండా వెళ్ళి పోతాను. ఈ భౌతిక రూపంలో నన్ను మళ్ళీ





మీరెవ్వరూ చూడలేరు. ఈ మాట గుర్తుంచుకోండి. జాగ్రత్త”.

బాబా ఇంత గట్టిగా ఎప్పుడూ మాట్లడలేదు. మండలివారు ఖిన్నులయ్యారు. బాబాని ఎలా ప్రసన్నం చేసుకోవాలో తెలియలేదు. భయం భయంగా గడిపారు ఆ ప్రొద్దుట.

మధాహ్నానికి బాబావారి కోపం కొంత తగ్గింది.

ఛగన్‌కి ఈత బాగా వచ్చు. గజ ఈతగాడనవచ్చు. అందుకనే పిల్లలకి ఈత నేర్పమన్నారతన్ని బాబా. అతను సరేనన్నాడు. . ఒకరోజున ఏమయింది, ఛగన్‌కు చెప్పకుండా కొంతమంది పిల్లలు ఈతకి వెళ్ళారు. ఈ సంగతి తెలిసి ఛగన్ కంగారు పడ్డాడు. వెంటనే నది వొడ్డుకి పరుగెత్తాడు. అక్కడ దృశ్యం హతాశుడిని చేసింది. నదిలోకి బాగా లోపలికి వెళ్ళిన ఒకళ్ళిద్దరు మునిగి పోయేస్థితిలో వున్నారు. నీళ్ళలోకి దూకి వాళ్ళని ఒడ్డికి చేర్చాడు ఛగన్.

ఆ మర్నాడు అబ్బాస్ ఖాన్ అన్న కుమారుడు ఈతకు వెళ్ళి మునిగి పోతుంటే, మెహదీఖాన్ కాపాడాడు.

ఈ రెండు సంఘటనల తర్వాత, “ఇహ ఈత పాఠాలు చాలు” అన్నారు బాబా.

ఐతే, రుస్తుం బలవంతంపై, పిల్లల ఈతకు అనుమతించారు. “ మీ అందరికీ ఈత తెలుసు. నాలో అందరూ ఈదుతారు. కానీ నాకు మాత్రం ఈత రాదు. గమ్మత్తుగా లేదు”, అన్నారు.

“అదేమిటి బాబా? మీరెందుకు ఈత నేర్చుకోలేదు”, అని దస్తూర్ అడిగాడు.

పరంధాముడు చిరునవ్వు నవ్వారు. ఆ నవ్వులో ఎన్ని అర్థాలో. తెలుసుకోవాలనుకొంటే, నాకు ఈదవలసిన అవసరం ఇహపై లేదు కాబట్టి ఈత నేర్చుకోలేదు. ఆద్యంతాలులేని అనంతంలో నేను ఈదాను. ఇప్పుడు అందరూ నాలో ఈతలాడుతున్నారు. అది వాళ్ళకి తెలియదనుకో, అని దస్తూర్‌కి విడమరచి చెప్పారు.

ప్రభువుకి దగ్గరగా అబ్దుల్లా ఇంకా వుంటున్నాడు. కొత్త వెదురు పాకలో బాబావారి

స్థానం ప్రక్కనే అబ్దుల్లాకూ ఉచిత స్థానం కల్పించారు. చాలా శ్రద్ధాసక్తులతో పెండూ, పాద్రి ఈ పని పూర్తి చేశారు. పాకపై ఎర్ర జెండా పెట్టారు. జండా ఎగురుతూంటే, పాక దగ్గరకి ఎవరూ వెళ్ళకూడదని హెచ్చరించారు. ప్రేమాశ్రమం, సాధక ఆశ్రమం నోటీసు బోర్డుల్లోకూడా ఈ హెచ్చరిక వ్రాయించారు. జూలై 1వ తేదీనుంచీ ప్రేమాశ్రమ పిల్లల ఆధ్యాత్మికోన్నతి కోసం ఈ పాకలో నేను పని చేస్తాను. అని బాబా చెప్పారు.

ప్రేమాశ్రమం పిల్లలంటే అందరూ ఈర్ష పడేలా చేస్తానన్నారు.

జూన్ 28వ తేదీ నుంచి బాబా ప్రేమాశ్రమం పిల్లలతో ఎక్కువ సేపు గడుపుతున్నారు. ఉదయం 9 నుంచి 11 వరకూ, మళ్ళీ సాయంత్రం ఐదు నుంచి ఏడు వరకూ, పిల్లలని తమ దగ్గర వుంచమని బాబా ఆదేశించారు. మళ్ళీ గతంలోలాగ అంటే, మెహెరాబాద్‌లో లాగా, పిల్లలు దైవానుభూతిలో తేలిపోతారనుకొన్నారు మండలివారు. అప్పట్లో లాగ మళ్ళీ వీళ్ళు ఎక్కి ఎక్కి ఏడుస్తారేమో ననుకొన్నారు.

జెస్సావాలా కుటుంబం, నేసేర్వాన్ సాథా టోకా వచ్చారు. బాబా దర్శనం చేశారు. ఆవేళ ఆశ్రమం పిల్లల బాగోగుల గురించి బాబా వారు బువాసాహెబ్‌ని అడిగారు. అతను వోపికగా బదులు చెప్పాడు. తన ఇబ్బందుల్ని ఏకరవు పెట్టాడు. రావ్ సాహెబ్, ఛాన్జీలతో తంటా వచ్చింది. నా పనికి అడ్డం వస్తున్నారని చెప్పారు. ఈ మాట నిజమేనన్నాడు దస్తూర్. ఈ ఇద్దరికీ కబురు వెళ్ళింది. వెంటనే వాళ్ళు వచ్చారు. వీళ్ళ వల్ల పిల్లలు పాడైపోతున్నారని రావ్ సాహెబ్ పిర్యాదు చేశాడు. దస్తూర్ కూడా తన మనసులో మాట చెప్పాడు. మాటా మాటా పెరిగింది.

వాతావరణం వేడి ఎక్కింది.

దస్తూర్ కోపంతో వూగి పోయాడు.

కొంచెం గట్టిగానే అరిచాడు.

బాబా మందలించారు. నువ్వు చెప్పింది నిజమే కానీ, నువ్వు చెప్తున్న పద్ధతి బాగా లేదు అన్నారు. ఇంకాస్తంత కోపం వచ్చింది దస్తూర్‌కి. నేనిక్కడ వుండను. బొంబాయికి వెళ్ళిపోతానన్నాడు.

నీ ఇష్టం అన్నారు బాబా. "వెళ్ళాలనుకొంటే, వెళ్ళిపో. నీకు నేను కావాలి తప్ప నీ అవసరం నాకు లేదు." అని స్పష్టం చేశారు.

అంతే దస్తూర్ నిట్టూర్పులు విడుస్తూ, పెద్ద పెద్ద అంగలు వేస్తూ తన గదికి వెళ్ళి పోయాడు.





అతని ప్రవర్తన బాబాకి చిరాకు తెప్పించింది. ఆ మాటే అన్నారు పురుష మండలితో.

"ఏమిటీ పద్ధతి? ఎంతకాలం సహించాలి నేను. మీ మొగాళ్ళు ఇక్కడ నాతో వుంటూ నన్నేమీ వుద్ధరించడం లేదు.

నేను మీకు గురువుని కానీ నేను మీకు వూడిగం చేస్తున్నాను.

నన్నేదో సేవిస్తున్నామన్న భ్రమలో వున్నారు మీరు.

సాయంత్రం బాబా దస్తూర్‌కి భోజనం పంపించారు. అతను త్రిప్పి కొట్టాడు. బాబా మళ్ళీ పంపారు. ఈసారి దారిలోకి వచ్చాడు.

అయినా బింకం తగ్గలేదు. రేపు వెళ్ళిపోతాను బాబా అని కబురు పంపాడు.

అహంకారానికి పోతే ఎదురు దెబ్బలు తింటావ్ జాగ్రత్త అని బాబా హెచ్చరించారు. ఎంతయినా కరుణామయుడు కదా. అందుకనే దస్తూర్ తప్పుని క్షమించారు. పై పెచ్చు బాధపడకని వోదార్చారు. హాయిగా పడుకో. అదే నిద్రవస్తుంది అని చెప్పారు.

మర్నాడు సుతిమెత్తగా చివాట్లు పెట్టారు. మంచీ, చెడూ విడమరిచి చెప్పారు. అహంకారం తెచ్చే అనర్థాలని మనస్సుకి హత్తుకొనేలా వివరించారు.

నా ఇచ్ఛ ప్రకారం విధి నిర్వహణ చేయండి అన్నారు. త్రికరణ శుద్ధిగా విధి నిర్వహించమన్నారు. అంతకంటే శ్రేష్ఠమైన పద్ధతి మరొకటి లేదన్నారు. మీ వంతు ప్రయత్నం చేయండి. నేను మీకు అండగా వుంటానన్నారు. పొగరు, అహంకారం పనికి రానివన్నారు. వాటిని చిటికెడు వుప్పుతో పోల్చారు. చిటికెడు వుప్పు తగలగానే గిన్నెడు పాలు విరిగి పోతాయి. అలానే కించిత్ అహంభావంతో మీ సుగుణాలన్నీ ఎందుకూ పనికి రాకుండా పోతాయని హెచ్చరించారు.

మనస్సు చెప్పినట్లు నడుచుకోవాలా బుర్రకి పని చెప్పాలా. ఇది వోచిక్కు ప్రశ్న.ఇది బాబా వారికి తెలియకపోతే కదా! అందుకని ఆయన ఏమి చెప్పారో తెలుసా! ప్రతి చిన్న పనికీ ఇదిగో ఇలా ఫలానా ప్రకారం చేయమని వివేకం చెప్తుంది. మనస్సుకి తట్టిన ప్రకారం చేయనివ్వదు. దీనితోనే ఎదురవుతుంది అసలు తంటా. కాబట్టి ఏం చేయాలి? నా ఇచ్ఛ ప్రకారంగానూ, త్రికరణ శుద్ధిగానూ విధి నిర్వహించు అని బాబా వారు దస్తూర్‌కి జ్ఞానోదయం చేశారు.

జూన్ 30వ తేదీన మెరెడిత్ స్టార్ వచ్చాడు. వెంట భార్య మార్గరెట్, సోదరి ఎస్సర్ రాస్ వచ్చారు. మధ్యాహ్నమయింది. వాళ్ళు టోకాలో అడుగుపెట్టేసరికి. వీళ్ళ కారులోనే మరో నలుగురు వచ్చారు.

వాళ్ళెవరు అంటే, బొంబాయి నివాసులు– మినూ పోహెువాలా, అర్ధషేర్ ,షాపూర్‌జీ, క్వెట్టానుంచి రూసీ ఇరానీ, ఘటకోపర్ నుంచి కేకి ఇరానీ. ఈ నలుగురు బాబా దర్శనానికి వచ్చారు. గోదావరి– ప్రవర నదుల సంగమం దగ్గర మెరెడిత్‌ని కలిశారు. మేమూ బాబా దగ్గరకి వెడుతున్నాం. అందరం కలిసి వెడదాం అని తన కారు ఎక్కించుకొన్నాడు.

టోకా ఎంతగానో నచ్చింది అందరికీ. పరబ్రహ్మ పరమాత్మ విశ్రామ ధామం నచ్చని వారెవరయినా వుంటారా! గోదావరి, ప్రవరలతో పాటు మెహెర్ ప్రేమవాహిని కలిసిన కొత్త సంగమ స్థానం టోకా. ఆనందంతో మనస్సు పరవళ్ళు త్రొక్కింది అతిథులకి. వీళ్ళకి రుస్తుం ఆశ్రమం చూపించాడు. వాళ్ళకి కేటాయించిన బసకి తీసుకువెళ్ళాడు. ఇవి మీ గదులు. మీ కోసమే, మీరు వస్తున్నారని కట్టించామన్నాడు. ఈ ఫర్నిచర్‌ని మెహెరాబాద్ నుంచి తెప్పించామన్నాడు.

క్లుప్తంగా.. ..,

## టోకా - హాపీవ్యాలీ గురించి

టోకా వివరాలు కాసిన్ని. మెహెరాబాద్ నుంచి టాక్సీలో టోకా వెళ్ళవచ్చు.

నగర్ నుండి టోకా సుమారు 80 కిలో మీటర్లు.

రెండుగంటల ప్రయాణం. నగర్ నుంచి ఔరంగాబాద్ వెళ్ళే దారిలో వస్తుంది టోకా. ఈ మార్గంలోనే శనిసింగినాపురం వెళ్ళే దగ్గర దారి కనిపిస్తుంది.

ప్రవర నది రెండు ప్రక్కల పురాతన దేవాలయాలున్నాయి.

ఈ రెండింటినీ కలుపుతూ బ్రిడ్జి కట్టారీ మధ్యనే. సరే బ్రిడ్జి దాటాక, ప్రాచీన శివాలయం, వో ఆశ్రమం కన్పిస్తాయి. అక్కడే ఒక చెరుకు రసం దుకాణం, టీ స్టాలు వున్నాయి. వాళ్ళని ఎవర్ని అడిగినా బాబా గుడికి దారి చూపిస్తారు.

ఎవరైనా వెంటవస్తారు రమ్మని అడిగితే.

రోడ్డు కంకర రోడ్డు కాదు. జీపులు, టాటా సుమోలు సునాయాసంగా పరిగెడ్తాయి.

ఆ రోడ్డు పైన వో కిలో మీటరు వెళ్ళాక, రోడ్డు దిగి పొలాల మధ్య నడుస్తూ సంగమం వొడ్డు చేరవచ్చు. బాబా గుడి సంగమంకు దగ్గరగా వుంది.

ఈ ఏడు అమరతిథి తర్వాత మేము కొంతమందిమి టాటా సుమోలో బాబా గుడికి వెళ్ళాం. గుడిలోకి అడుగు పెట్టే సరికి 12 గంటలు దాటి ఐదు నిమిషాలయింది.

ప్రార్థన చేసి ఆరతి పట్టాము. ప్రసాదం ఎట్లాగా అనుకొంటూంటే, సంచీలో





నారింజ పళ్ళు రెండు కనిపించాయి.

అవే మా అయిదుగురి ప్రసాదం. మనస్సు ఆనందంతో గెంతులు వేసింది.

ఇంతకీ మేము ఐదుగురం ఎవరిని కదూ మీ ప్రశ్న పాఠకమహాశయా.

అయితే వినండి. చిరకాలంగా మెహెరాబాద్‌లో వుంటున్న సంస్కృతం, తెలుగు, మరాఠీ పండితుడు జిలిపిల్‌వార్ మాధవరావ్, మెహెర్ ఎగ్జిబిషన్‌లో పనిచేస్తున్న అర్చన దేశ్‌ముఖ్, హిందీ, మరాఠీ భాషల్లో పాటలు పాడే మెహెర్ రిట్రీట్ ఉద్యోగి రితేష్, కొత్తగా మెహెర్ కాలనీ నివాసి అయిన ఢిల్లీ వాణి. వీళ్ళతో పాటు ఈ అనువాదకుడు, టోకా దర్శించి చిరకాలవాంఛ తీర్చుకొన్నారు.

## హాపీవ్యాలీ

టోకా నుంచి వాపసు వస్తూ హాపీవ్యాలీని కూడా మేము దర్శించాం.

మెహెరాజాద్ అంటే పింపలగామ్‌కి దగ్గరగా వుంది హాపీవ్యాలీ. బాబావారు తరుచు వెళ్ళే వారిక్కడికి. కారులో హాయిగా వెళ్ళవచ్చు హ్యాపీవ్యాలీకి.

వో అరగంట కూడా పట్టదు పింపలగామ్ నుంచి.

ఇది నిజంగా పెద్దలోయ. దట్టమైన అడవి. కారు దిగగానే వో పాత గుడి కన్పిస్తుంది.

గుడికి కుడి ప్రక్క, ఎడమ ప్రక్కలా మెట్లున్నాయి. లోయలోకి వెళ్ళడానికి ఎడమ ప్రక్కన పాత కాలపు మెట్లున్నాయి. చూడగానే మంగళగిరి మెట్లు గుర్తుకు వస్తాయి.

అయితే ఇవి అన్ని లేవు కాని, అమ్మో, వీటిని దాటడమెలా అనిపిస్తాయి.

కాస్తంత వోర్చుకొంటే, గుడి దగ్గరకి చేరుకొని రామాయణ కాలంనాటివనే నీళ్ళ బావి, సీతమ్మవారి స్నానాల గది మొదలైనవి చూడవచ్చు.

కుడి ప్రక్క మెట్లు అని చెప్పామే, వాటిని చూడగానే ప్రాణం లేచి వస్తుంది.

వీటిని మెట్లు అనేకంటే సునాయాసంగా పైకి ఎక్కడానికి చేసిన ఈ కాలపు ఏర్పాటు అంటే బాగుంటుంది. హాపీవ్యాలీలో కాసేపు తిరిగి, అలసి పోయాక ఈ మెట్ల మార్గాన చక చకా పైకి రావచ్చు.

ఇంత వివరంగా ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే, చాలా మంది తెలుగువారు టోకా, హ్యాపీవ్యాలీల గురించి వినటమే తప్ప చూసి ఉండరు. అమ్మో! అవి ఎంత దూరమో నన్నభావన వారిలో మెండుగా వుంది.

మెరిడిత్ స్టార్ మహాశయుడు టోకా జీవితానికి అలవాటు పడుతున్నాడు. అతని భార్య, మార్గరెట్, సోదరి ఎలిజిబెత్ ఆశ్రమ వాసులకి దగ్గరయ్యారు. అందరికీ చేదోడు వాదోడుగా వుంటున్నారు.

రోజూ వో మూడు గంటలు కుట్టు పని చేయమని బాబా ఆదేశించారు.

గురువాజ్ఞ అంటూ, కుట్టు పని చేస్తున్నారు. ధ్యానం కూడా చేస్తున్నారు. ఆదీ బాబా ఆజ్ఞ మేరకే సుమా. అప్పుడప్పుడు ఈ ఇద్దర్నీ రమ్మని బాబావారి నుండి కబురు వచ్చేది.

ఆనందంతో గెంతులు వేస్తూ మౌనావతారుని సన్నిధిలో కాసేపు కూర్చొనేవారు.

నా ప్రక్కనే కూర్చోమని బాబావారు అనటం మామూలు అయింది.

ఇహ మెరిడిత్ స్టార్ విషయానికి వస్తే, బాబావారు ఈ తెల్లదొరకీ కొంత పని పెట్టారు. రోజూ మౌనం పాటించమన్నారు. ఇన్ని గంటలని కానీ అన్ని రోజులు అని కానీ చెప్పలేదు. కొంతకాలం మౌన ముద్ర పట్టమన్నారు. స్టార్‌కి ధ్యానం ఏకాంతవాసం కొత్త కాదు. సరే నన్నాడు.

'నా విశ్వ ప్రకటీకరణకి సమయం దగ్గర పడింది. నా జగన్నాటకంలో నీకూ పాత్ర వుంది. నీది వో ముఖ్యమైన భూమిక అని తెలియజేశారు.

ఆవేళ జూలై నాల్గవ తేదీ. సర్వాంతర్యామి తనంత తానుగా పని కల్పించాడు. అంటే అదేమీ ఆషామాషీ మాటకాదు. అలా వూరికినే చేయడు. ఏదో మర్మం దాగి వుంటుంది. కానీ పాపం మన దొరగారికి ఆ సంగతి తెలిస్తే కదా! మరి ఏం చేశాడు?

జూలై ఐదున, అంటే మౌనం పాటించమని బాబా వారు చెప్పిన మర్నాడు, తన గది ముందు బోర్డు తగిలించాడు

"తలుపు తట్టకండి. ధ్యానంలో వున్నాను", అని బోర్డుపై వ్రాశాడు.

ఒకవేళ బాబావారు తన గదికి వస్తేనో? ఈ అనుమానం వచ్చినట్లు లేదు.

అయినా ఎవరు వస్తేనేం, ధ్యానం ధ్యానమే కదా అనుకొన్నాడో ఏమో మరి.

ఏది ఏమయితేనేం బాబావారు స్టార్ గదికి వచ్చారు. తలుపు తట్టారు. అతను బదులు పలక లేదు. తలుపు తెరవ లేదు.

ఎవరికీ ఏమి పాలు పోలేదు. సృష్టికర్త స్వయంగా వచ్చి వాకిట నిలబడి, తలుపు తెరవమని అడుగుతూంటే, "ధ్యానంలో వున్నాను, నీ పైనే నా దృష్టి అంతా, నన్ను డిస్టర్బ్ చేయకు! అనేవారు ఎవరైనా వుంటారా? ఎక్కడయినా! బహుశా ఈ ధర్మ సందేహం మార్గరెట్‌కి వచ్చినట్లుంది. అందుకనే ఆమె, శ్రీవారి "నోటీసు బోర్డు" ని బాబా దృష్టికి తెచ్చింది. చిద్విలాసమూర్తి చిరునవ్వు నవ్వారు. ఆ నవ్వే పది వేల వరహాలు. అందులోనే





ఎన్నో అర్థాలు. ఇహ వేరే వ్యాఖ్యానం అవసరం లేదనట్లు, బాబావారు తమ గదికి వాపసు తిరిగారు. బాబావారు ఏం చెప్పారూ? స్టార్‌కి మౌనం పాటించమన్నారు.

ధ్యానం చేయమన లేదు. సరే ధ్యానం దేనికిట? భగవత్ సాక్షాత్కారం కోసం.

ఆ భగవంతుడే వచ్చాడు స్టార్ దగ్గరకి. మరి అతనేమో ధ్యాన నిద్రలో వున్నాడు. అతని గుండె తట్టి మేల్కొల్పాలను కొన్నారు ప్రభువు.

అతనేమో కళ్ళు మూసుకొని మనో నేత్రం కోసం వెదుకుతున్నాడు.

ప్రభువు ఏం చేస్తాడు చెప్పండి? అయ్యో! పాపం! అని జాలిపడటం తప్ప.

జూలై 5వ తేదీన బాబా ఉపవాస దీక్ష పట్టారు. టేబుల్ క్యాబిన్‌పై ఎప్పటిలా ఎర్ర జండా ఎగిరింది. దూరాన్నుంచే జండాని చూసి, ఎవ్వరు క్యాబిన్ చుట్టు ప్రక్కలకి రాలేదు. ఆ రోజంతా బాబావారు ఏమీ తినలేదు. మంచి నీళ్ళు ముట్ట లేదు.

చీకటి పడ్డాక మాత్రం కాసిని నీళ్ళు త్రాగారు. నీళ్ళ లాంటి టీ తీసుకొన్నారు.

అదీ వో కప్పు మాత్రమే సుమా. ఆ వేళ బాబా వో మాట అన్నారు. అందరూ నన్ను పూజిస్తారు. నువ్వే మా దైవానివి అంటారు. అయితేనేం, నా మాట ప్రకారం నడుచుకోరు. నా ఇచ్చని శిరసావహించరు. ఒక్కడంటే ఒక్కడు మచ్చుకి నాకు శిష్యుడు లేదు. అందరూ నాకు గురువులే. వాళ్ళ ఇచ్చ ప్రకారం నడుచుకొనే శిష్యుణ్ణి నేను అని పేర్కొన్నారు.

ప్రేమాశ్రమం పిల్లల్లో మళ్ళీ ఆనందోత్సాహాలు కనిపిస్తున్నాయి.

ఆధ్యాత్మికత వైపు పరుగెడుతున్నారు. ఉద్వేగభరితులవుతున్నారు.

ఇదంతా వారి ద్వారా బాబావారు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమ ప్రభావం వల్లనే. ఇది పరంధాముడికి తెలుసు.

పిల్లలకి తెలియదు. అయితే పిల్లలకి వో మాట చెప్పారు. ఆధ్యాత్మికంగా వాళ్ళకి ఇస్తున్న వరాన్ని మందుతో పోల్చారు. ఏ మందునైనా పెద్ద మోతాదుతో ఒక్కసారి వేసుకో కూడదు. అది మంచిది కాదు కదా. అలానే భోజనం ఎక్కువ అయినా తిప్పలే! తిన్న అన్నం వెంటనే అరగదు కదా. ఈ సంగతే పిల్లలకి చెప్పారు. గ్రహ ప్రాప్తకి తగ్గట్లుగా మీరుండాలి. ఆ అర్హత మీకు కల్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్నారు. కాస్తంత వోపిక పట్టండి. తొందర పడకండి అని చెప్పారు. త్వరలోనే విందుకు పిలుపు వస్తుంది. ఆ పిలుపు కోసం ఎదురు చూడండి అన్నారు.

బొంబాయి నుంచి దస్తూర్ ఆరవ తేదీన తిరిగి వచ్చాడు.

బాబావారు కూర్చునే గద్దీ ఖాళీగా కన్పించింది. గద్దీ అంటే పెద్ద పడక కుర్చీ అని చెప్పుకోవచ్చు. అయితే మన తెలుగు ఇళ్ళలో కనిపించే పడక కుర్చి కాదిది.

ఇదొక చెక్క మంచం. కాళ్ళు చాపుకోని బారజాపుకుని కూర్చోడానికి వీలుంటుంది. చెక్క మంచం కాబట్టి మెత్తటి పరుపు లేస్తారు. ఎగువ మెహెరాబాద్‌లో మన్సారీ గది ఎదురు వరండాలో "గద్దీ"ని చూడవచ్చు. బాబావారు 1930 దశకంలో కూర్చున్న ఆ గద్దీని మనమంతా తాకి తరించవచ్చు.

వెంటనే దస్తూర్ కాసేపు గద్దీపై కూర్చున్నాడు. ఈ దృశ్యం భైలీ కంట పడింది. అగ్గి గుగ్గిల మయ్యాడు.

ప్రభువు కుర్చునే చోట వీళ్ళూ వాళ్ళు కూర్చోటమా! ఎంత తప్పు!

వెంటనే బాబా వారికి ఫిర్యాదు చేశాడు. షెరీయార్జీ సుతుడికి ఇదేమీ పట్టలేదు.

'దస్తూర్ కుర్చున్నాడా! అయితే ఏమిటి? కూర్చోనీ, అన్నారు. నాకు కావాల్సింది దస్తూర్ ప్రేమ. ఇంకేమీ అక్కర్లేదు. దస్తూర్‌కి నేనంటే ప్రేమ. అది చాలు. నాకు గద్దీ మీద కూర్చుంటే కూర్చోని. నాకేమీ పట్టదు అన్నారు. గద్దీ అంటే వో పెద్ద కుర్చీ. చెక్క వస్తువు. దానిపై వో పరుపు వేశారు. అంతే కదా! ఇవి నిరర్ధకమైనవి. ఇవి నాకు వద్దు

నాకు కావాల్సింది ప్రేమ. విధేయత అని వివరించారు. ఆ వేళ గుల్మాయి పుట్టిన రోజు. ఆధ్యాత్మిక మాతగా బాబావారామెని కీర్తించారు. ఎప్పుడో భగవంతుడి సేవలో తాను లీనమయింది. తన పిల్లల్ని భర్తనీ ప్రభుసేవకే అంకితుల్ని చేసిన ధన్యురాలు.

ఆమెకి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు. అందరికీ మిఠాయి పంచారు బాబా. వేడి వేడి టీ అందరికీ ఇమ్మన్నారు. మధ్యాహ్నం రెండింటికి బాబావారిలో అసహనం కనిపించింది. ఈ టేబుల్ క్యాబిన్ నా పనికి సరైన చోటు కాదన్నారు.

వెంటనే అక్కడి నుంచి లేచారు.

నది వొడ్డు కేసి నడిచారు. ఏకాంతానికి మంచి చోటు కోసం చాలాసేపు వెదికారు. ఏ జాగా చూసినా ఏదో వొక లోపం కనిపించింది. ఏదీ నచ్చలేదు. చివరకి గద్దీ దగ్గరకి వచ్చారు. అక్కడా వో మూలగా కూర్చుంటే బాగుంటుందనిపించింది. అక్కడ ఎవరూ లేరు కాబట్టి తమ ఏకాగ్రతకి భంగం కల్గించదనుకొన్నారు. ఈ నిర్ణయానికీ గద్దీపై దస్తూర్ బైఠాయింపుకీ ఏదైనా సంబంధం వుందా అన్న మీమాంస పాఠకులకి రావచ్చు. ఈ ప్రశ్న వో అంతు చిక్కని ప్రశ్న. అయితే మరో కారణం వుందని మాత్రం చెప్పవచ్చు.

ఆ మర్నాడు, అంటే ఏడవ తేదీన తెలిసింది. ఆఘా ఆలీ తండ్రి, హాజీ మహమ్మదు వూడి పడ్డాడు.

నా పిల్లాడిని తీసుకు పోతానంటూ బొంబాయి నుంచి వచ్చాడు. మెహెర్‌బాబా టోకా ఆశ్రమం వదిలేశారని విన్నాను. పిల్లలందరూ పిచ్చివాళ్ళుగా మారారట అంటూ నిలదీశాడు. ఇలా అ దాటున రావటం, హడావుడి చేయడం హాజీకి కొత్త కాదు.





అయితే ఎప్పటిలాగే, ఈసారి కూడా, కొడుకుని చూడగానే మెత్త బడ్డాడు. పిల్లాడు బాగానే వున్నాడుగా అనిపించింది. తాను విన్నవన్నీ అబద్ధాలు అని తేలిపోయింది. రాత్రికి కొడుకుతో గడిపి, ఉదయాన్నే (జూలై 8వ తేదీ) బొంబాయికి వాపసు వెళ్ళాడు.

అర్దేషిర్ షాపుర్‌జీ బారియా, ఈ పేరు విన్నారా ఎప్పుడయినా? పోనీ కాకాబారియా పేరు! 1930 నుంచీ బాబా మండలిలో ఒకడైన కాకా పేరు వినని వారు ఎవరుంటారు. ఇతని పూర్తి పేరే అర్దేషిర్ షాపుర్‌జీ బారియా. టోకా ఆశ్రమానికి వచ్చాడు. మీతో వుంటాను బాబానన్నాడు. జగన్నాధుడు చిన్న పరీక్ష పెట్టారు.

ఓ పని చేయి. ఇక్కడ తడికలు చాలా అవసరం. వో తడిక అల్లు వెదురుతో అన్నారు. నవసారీలో పుట్టి దేశ విదేశాల్లో ఎన్నో ఉద్యోగాలు చేసిన కాకాకి తడికలు అల్లటం రాదు. మరి ఎలాగ! ప్రభువాజ్ఞని పాటించాలి. పెండూ దారి చూపాడు. "ఇదిగో చూడు ఇలా వెదురుతో తడికలు అల్లుతారు." అని చూపించాడు. చెప్పిన ప్రకారం చేశాడు 'శహభాష్' అని మెచ్చుకొన్నారు. అలా అంటూనే ఎదురుగా వున్న కాకా బారియా చెప్పులు తొడుకొన్నారు. పాదం పూర్తిగా పట్టలేదు 'అబ్బే ఇవి నా సైజు చెప్పులు కావు. నాకు సరిపోవటం లేదు అంటూ పెదవి విరిచారు.

నీ చెప్పులు నా సైజువి అయ్యాక నిన్ను నాతో వుండనిస్తాను అన్నారు.

బాబా వారి మాటలు కాకా బారియాకి అంతు చిక్కలేదు. ఏం చేయాలో తోచ లేదు. బాబావారి మాటలకి అర్ధం పాఠక మహాశయులకి తెలిసింది కదా! అందుకు తగ్గ అర్హత వుండాలి. ఆ అర్హతని సంపాదించు కోవాలి. అందుకు తగ్గ మూల్యం చెల్లించాలి. బారియా కొంత సందిగ్ధంలో పడ్డ మాట నిజమే కానీ, బాబావారి అంతరార్ధం గ్రహించాక, బాబాకి సరిపడే చెప్పుల జత ఖరీదు చెల్లిస్తానంటూ వెనక్కి వెళ్ళాడు. అతగాడిని బాబా దూరంగా అట్టే పెట్టింది ఒక రోజా రెండు రోజులా.

ఏకంగా రెండేళ్ళు పరీక్ష పెట్టారు. సాన బెట్టిన వజ్రమయ్యాక, బాబావారి దగ్గరకి వచ్చాడు. 1930 నుంచి చివరి వూపిరి వరకూ బాబా నామస్మరణ చేస్తూ మండలిలో ఒకడుగా వున్నాడు. కాకా నవసారిలో పుట్టాడని చెప్పుకొన్నాము కదా. 1891 ఫిబ్రవరి 23వ తేదీ ఆయన జన్మదినం. మెకానికల్ ఇంజనీరింగ్ చదివాడు. రెండేళ్ళు గ్రీవ్స్ కాటన్ మిల్లులో పని చేశాడు. ఈ బొంబాయి మిల్లులోనే చాన్జీ కూడా పని చేశాడు. ఆ తర్వాత నాగపూర్, జంషెడ్‌పూర్‌లో చాలా రోజులున్నాడు. నాగపూర్‌లో కూడా కాటన్ మిల్లులోనే పని చేశాడు. అక్కడ ఐదేళ్ళున్నాడు. జంషెడ్‌పూర్‌లో టాటా స్టీలు కంపెనీలో రెండేళ్ళున్నాడు. అక్కడినుంచి ఇరాక్ వెళ్ళి మెకానిక్‌గా వో వెలుగు వెలిగాడు. 1928లో బాబా వారిని దర్శించే నాటికి ఇతని వయస్సు 38 ఏళ్ళు. అప్పటికి ఇండియా తిరిగి వచ్చి, బొంబాయిలో టాక్సీల వ్యాపారం చేస్తున్నాడు. చాలా టాక్సీలుండేవి అతని దగ్గర.

చిన్నప్పటినుంచీ యోగులు, సిద్ధ పురుషుల సమాధులని దర్శించడం అతనికి అలవాటు. నాగపూర్‌లో వుండే రోజుల్లో తాజుద్దీన్ బాబా దీవెనలు పొందాడు. నీకు అంతా మేలు జరుగుతుంది అని సద్గురువు అభయం పలికాడు.

పూనేలో బాబాజాన్‌ని దర్శించాడు. ఆ వూర్లో వున్నన్ని రోజులూ, ఆ తల్లి దగ్గరకి వెళ్ళేవాడు. ఎదురుగా కూర్చునేవాడు. ఎందరెందరో తను కోర్కెలు తీర్చమని ప్రాధేయ పడుతుంటే బారియా మాత్రం తనకేమీ పట్టనట్లు కుర్చునేవాడు. ఒక రోజున ఆ తల్లి అడిగింది "ఏం నాయనా" రోజూ వస్తున్నావ్. కానీ ఏమీ కోరుకోవటం లేదే అందరిలాగా అని ప్రశ్నించింది. కాకా బారియా ఏం బదులు చెప్పారో వింటే ఆశ్చర్య పోతారు మీరు.

అమ్మా! నువ్వు మహా సముద్రం వంటి దానివి. నేను వో ప్రయాణికుడిని.

దప్పిక తీర్చు కోడానికి గుక్కెడు నీళ్ళ కోసం సముద్రం వొడ్డికి వచ్చాను అన్నాడు. నారాయణ మహారాజ్‌నీ, ఉపాసినీని కూడా కాకా కలిశాడు.

ఇతన్ని తన ప్రక్కనే కూర్చోపెట్టుకొన్నాడు నారాయణ మహారాజ్. ప్రేమగా లాలించాడు. ఉపాసినీ కూడా కాకాని ఆదరంగా పలకలించాడు. మెహెర్‌బాబాని చేరి సేవించి తరించమని చెప్పాడు.

ఇదీ కాకా బారియా కథ క్లుప్తంగా. మున్ముందు తరుచు వినిపిస్తుందీ పేరు.

టోకా ఆశ్రమంలో అన్నీ వున్నాయి కానీ మంగలి షాపు లేదు. గడ్డం గీయడం, క్షవరం చేయడం పెండూ పని అయింది. సుబేదారు సహాయం చేస్తానన్నాడు.

మంగలి షాపు కోసం తడికలతో వో గది కట్టారు. రెండు అద్దాలు తగిలించారు. రెండు కుర్చీలు తెప్పించారు. తమ వంతు వచ్చే వరకు ఖాళీగా కూర్చోకుండా చదవటానికి పేపర్లు, పత్రికలు పెట్టారక్కడ. పెండూ మంగళి షాపుని లాంఛనంగా జూలై ఎనిమిదిన తెరిచారు. గ్రామ్ ఫోను పై పాటలు, వో ప్రక్క మెహెర్జీ సాము గారిడీలు ఇంకో ప్రక్క. అందర్నీ పెండూ క్షవరశాలకి రప్పించాయి. వచ్చిన వారందరికీ టీ ఇచ్చారు. దేవ దేముడిని లాంఛనంగా లోపలికి తీసుకువెళ్ళి, కుర్చీలో కూర్చోబెట్టి మూడు కత్తెర్లు వేశాడు పెండూ.

**-సశేషం**

# హెల్ప్‌లైన్

మీరు ఎటువంటి ఫిర్యాదులనైనా అందించాలంటే **శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040- 27964050, 9441218841, శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్- 94403-65640,** హైదరాబాద్‌లను సంప్రదించగలరు.





# సమాధి పైభాగాన సూపర్ స్ట్రక్చర్ నిర్మాణం

అమరతిథి సమయంలో బాబా సమాధికి ఎదురుగా ఉన్న ఆంఫీ థియేటర్ నుండి బాబా సమాధి వరకూ, ఆ విశాల ప్రాంగణమంతా బాబా ప్రేమికులకు ఎండ తగలకుండా ట్రస్టువారు ప్రతి ఏటా రంగు రంగుల అందమైన షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఇంతవరకే మనలో చాలామందికి తెలుసు.ఐతే ఇటీవల బాబా ప్రేమికులు శ్రీ దుగ్యాల ప్రభాకర్ రావు, తెట్టెకుంట అగ్రహారం, కరీంనగర్ జిల్లా వారు తమ వంతుగా రూ. 14, 01,007..00 విరాళంగా ఇస్తానని, దయచేసి షామియానాల స్థానంలో ఏదేని శాశ్వత ప్రాతిపదికన ఒక షెడ్డు మాదిరి ఏర్పాటు చేయవలెనని, చైర్మన్, బాబా ట్రస్టు వారిని కోరారు. ట్రస్టు సభ్యులు ఈ విషయాన్ని తమ బోర్డు సమావేశంలో చర్చించి, ఈ పవిత్ర ప్రదేశంలో షెడ్డులాంటి నిర్మాణం చేపట్టం కుదరదని, అవతారుడే స్వయంగా తన ట్రస్టు డీడ్‌లో సమాధి పైభాగాన ఒక సూపర్ స్ట్రక్చర్ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారని తెలిపారు.

ఈ సూపర్ స్ట్రక్చర్ నిర్మాణంకై ఖర్చు సుమారుగా నూరు కోట్ల రూపాయల అంచనా అవుతుందని, నిధుల కొరత వల్ల తక్షణం ఈ నిర్మాణపు పనులు చేపట్టలేమని అన్నారు.

కాగా, ఈ నిర్మాణం కోసం ఇప్పటికే కొందరు బాబా ప్రేమికులు విరాళాలు ఇచ్చి వున్నారు గావున, శ్రీ దుగ్యాల ఇవ్వచూపిన రూ 14 లక్షల పైచిలుకు నగదును సూపర్ స్ట్రక్చర్ పద్దు క్రింద జమ చేయవలెనని కోరారు. అందుకు శ్రీ దుగ్యాల అంగీకరిస్తూ, బాబా ప్రేమికులు తెలుగువారు, మరి ఇతరులు, పాశ్చాత్య బాబా ప్రేమికులు అందరూ చొరవ తీసుకుని త్వరలో ప్రతిపాదిత సూపర్ స్ట్రక్చర్ నిర్మాణం పూర్తయ్యేలా తగిన కృషి చేయాలని కోరుతున్నారు.

# పత్రిక ఖర్చులకై ...

బెంగళూరుకు చెందిన బాబా ప్రేమికురాలు శ్రీమతి బి. సరస్వతి మెహెర్‌బాబా ప్రచురణలో వినియోగించమని రూ. 516 విరాళంగా పంపినారు.

హైదరాబాద్‌లోని ఒక యవ బాబా ప్రేమికుడు ( పేరు ప్రచురించవద్దని విజ్ఞప్తి చేశారు) గత ఏడాది ప్రతి నెలా రూ. 500 చొప్పున 2010 జనవరి నుండి డిశంబరు వరకూ ఇచ్చారు. కాగా, ఈ ఏడాదికిగాను ఏకమొత్తంగా రూ. 7,000 ఇచ్చినారని ప్రకటించేందుకు సంతోషిస్తున్నాము.అలాగే, హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ వైద్యురాలు తమ వంతుగా రూ 2000 పత్రికా ఖర్చులకై 2011 ఫిబ్రవరి 25న ఇచ్చినారు. ఈమె కూడా తన పేరు ప్రకటించవద్దని కోరినారు.

# ప్రార్థనలు

***రచన- శ్రీ మంచం బుచ్చిలింగప్ప***

మెహెర్‌బాబా ఇచ్చిన ప్రార్థనలను, తెలుగులో శ్రీ మంచం బుచ్చిలింగప్పగారి అనువాదాన్ని, కొందరు బాబా ప్రేమికులు చాలా కాలంగా ప్రచురించమని కోరుతున్నారు. అరుదుగా ఆలాపిస్తున్న ఈ ప్రార్థనల అచ్చు ప్రతులు కూడా దాదాపుగా అలభ్యంగాను, అందరికీ అందుబాటులో లేకున్నాయి. అందుకే మెహెర్‌బాబా పాఠకులందరి పక్షాన ఈ చిన్ని ప్రయత్నం చేశాం. భద్రపరచుకోగలరు. ఐతే మంచం బుచ్చిలింగప్ప ఏప్రాంతంవారు, ఈ ప్రార్థనలు ఎప్పుడు అనువదించారు, ఏ కారణంగా ప్రస్తుతం ఈ ప్రార్థనలు వాడుకలో లేదో మీకుగాని తెలిస్తే ఆ వివరాలు రాసి పంపవల్సింది. లేదంటే ఫోన్ నెంబరు 9959553218 తెలియజేయగలరు.

దయచేసి స్పందించండి – **ఎడిటర్**

ఓ సర్వరక్షకా । ఓ సర్వసాక్షి!
ఆదియు లేదునీ । కంతంబులేదు

నిర్ద్వంద్వమూర్తివి । నిరుపమానుడవు
నీ ప్రమాణమెఱుంగ । నేర రెవ్వరును

ఏరంగులేదు నీ । కేవ్యాఖ్యలేదు
ఏరూపమును లేదు । యేపోల్కిలేదు

నీకు హద్దులు లేవు । నినుగొల్వలేరు
ఊహలకావల । నుందువు నీవు

గ్రహియింప శక్యమ్ము । కాద యెవ్వరికి
నిత్యుడ విలలేదు । నీకు నాశమ్ము

విభజింపగానిన్ను । వీలు లేదయ్య
దివ్య దృష్టికిగాని । దృశ్యమ్ముగావు

మున్నుంటి విపుడుంటి । ముందుండగలవు
అంతటి కన్నింట । కావలగలవు

అం తెఱుంగగరాని । యాదిని గలవు
సాకారివి మఱిని । రాకారివూవు

లోకమ్ము లన్నింట । లోకాల కవల
త్రిజగమ్ములందున । త్రిజగాల కవల





చింతింపగారాక । స్వేచ్ఛతోనుండి
వర్తించుచుందువు । స్వాతంత్ర్యవృత్తి

సర్వమ్ము సృష్టించు । స్రష్టవునీవు
ప్రభువులకెల్లను । ప్రభుడవు నీవు

ఎఱుగుదు మనముల । నెల్ల హృదయాల
సర్వశక్తుడవీవు । సాక్షివినీవు

అగణితజ్ఞానమ్ము । నగణితశక్తి
అగణితంబై యొప్పు । నానందమీవు

జ్ఞానవారిధి వీవు। జ్ఞాతవు నీవు
మహిమ త్రికాలముల్। నానంద మీవు

జ్ఞానవారిధి వీవు । జ్ఞాతవు నీవు
మహిమ త్రికాలముల్ । మదినెఱుంగుదువు

నీవె విజ్ఞానమ్ము । నిక్కమ్ముగాను
అతి దయాసాంద్రుండ । వతిదయామతివి

వరలు నాత్మలకెల్ల । పరమాత్మవీవు
పెక్కు రూపులనొప్పు । నొక్కడవీవు

సత్తుచిత్తానంద । సంపుటివీవు
సత్యమ్మునకునీవె । జగతిమూలమ్ము

ప్రేమదుగ్ధాబ్ధివై । వెలయుచుండెదవు
మొదటివాడవు నీవు । పురుషోత్తముడవు

ప్రభుడవౌదువు నీవె । పరమేశ్వరుడవు
దేవ దేవులకు న । తీతుండవీవు

వరపరబ్రహ్మమ్ము । పరమాత్మవీవు
"అల్లా" యిలాహి" యు । "యాజడాన్"

"అహరుమజ్దా" గాడ్డు । "నాల్మైటి" వీవు
భక్తులు భజియించు । ప్రభుడవు నీవు

అర్చింపగాదగ్గ । అధికారివీవు
దాన "ఈజాడం"చు । తలతురునిన్ను

ఓసర్వరక్షకా! । ఓ సర్వసాక్షి !!
నీకు మా ప్రార్థనల్ । నీకు జేజేలు.

# పశ్చాత్తాప ప్రార్ధన

ఓంకార రూపివై । యొప్పారుదేవ
హేపరబ్రహ్మమా! । హేపరమాత్మ

స్వర్గసీమ జరించు । జనక! సర్వేశ!
నిన్ను గొల్చెదమయ్య । నిశ్చలభక్తి
... ...... .....
పరితపించుము మాదు । పాపాల కెదలొ
అనృత మధర్మంబు । సపరిశుభ్రమ్ము
నగు తలంపులకెల్ల । నాత్మగుందెదము
పలుకగూడని పల్కు । పల్కినందులకు
చేయగూడని పనుల్ । జేసినందులకు
భావమ్ములోమేము । పరితపించెదము.
స్వార్థమ్ము చేనైన । స్పర్థచేనైన
చేసిన మాదుష్ట । చేష్టలన్నిటికి
ఆడినమాటల, కన్నియూహలకు
అధిక పశ్చాత్తాప । మందుచున్నాము.
కామవాంఛలకు మా । కామవర్తనకు
ప్రత్యేకముగ మేము । పరితపించెదము
ప్రతి యసత్యమ్ముకు । ప్రతి మోసమునకు
పల్కిన వాగ్దాన । భంగమ్ములకును
అపనిందలను మోపు । నపరాధములకు
చెఱుపులు తెఱ వెన్క । చేసినందులకు
మేము దుఃఖించెదము । మిక్కుటమ్ముగను
పరులను చెఱచెడి । పనులకునెల్ల
పరులను నొప్పించు । పలుకుకున్ బనికి
పరులకు వ్యధగూర్చు । ప్రతికోటికకును
అధిక పశ్చాత్తాప । మందెదమేము





పారమ్ములేని యో । పరమకృపాబ్ధి
మాపాపములకెల్ల । మన్నించుమయ్య
నీయిచ్ఛకనువుగా । నిలువగ లేక
మనము వాక్కాయాల । మా చేయుక్రియల
అన్నియు క్షమియింపు । మనుచుప్రార్ధించు
భక్తుల మీశ్వరా । పాలింపరారా!

## నిర్యాణం

కదిరి బాబా సెంటర్ నిర్మాణ కర్త శ్రీ జి. తిరుపాలు గారు ఫిబ్రవరి 18న తీవ్ర గుండెపోటుతో బాబాలో ఐక్యమయ్యారు. వారి ఆత్మకు శాంతి కలగాలని బాబావారిని ప్రార్ధిస్తూ వారి స్వగృహంలో సత్సంగ్ నిర్వహించామని శ్రీ హనుమాన్‌బాబా ఒక లేఖలో తెలిపారు.

## చల్లపల్లిలో ప్రేమిక సహవాస్

## 2011 ఏప్రిల్ 17 ఉ. 6.50 నుండి 5 గంటల వరకూ

చల్లపల్లిలో ప్రేమిక సహవాస్ 2011 ఏప్రిల్ 17 ఉ. 6.50 నుండి 5 గంటల వరకూ స్థానిక కన్యకా పరమేశ్వరీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు సెంటర్ అధ్యక్షులు శ్రీ చుండూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## విశాఖలో సంకీర్తన

ఉగాది పండుగ సందర్భంగా 2011 ఏప్రిల్ 4న బాబా ప్రేమికులు శ్రీ కె.వి. రత్నం గారింట్లో బాబా సత్సంగ్ నిర్వహించినట్లు తెలిపారు. శ్రీయుతులు టిడియస్ మూర్తి, సి.హెచ్. ఉషారాణి, ఎ. ఎస్. ఆచారి, యస్.వి. సత్యనారాయణ తదితరులు బాబా సత్య ప్రేమ సందేశాలుపై ప్రసంగించారని శ్రీ రత్నం ఒక ప్రకటనలో తెలిపారు.

## రామాయంపేటలో

మెదక్ జిల్లాలోని రామాయంపేటలో 2011 ఫిబ్రవరి 25న బాబావారి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నామని కార్యదర్శి శ్రీ సి.హెచ్.వి.దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు నూరు మంది బాబా ప్రేమికులు, చిన్నారులు ఆనందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని అయన తెలిపారు. ❋

*(గత సంచిక తరువాయి)*

## బాటసారులు

బెంగుళూరులో బాబా ఈ ప్రత్యేక మస్తులతో పనిచేస్తూ ఉండేవారు. ఎక్కువగా పిచ్చి ఆశ్రమం పని ఉంటే దీని తరువాతే అన్నమాట. ప్రతి రోజూ ఈ పని ఆశ్రమంలో తూరుపు తెల్లవారుతూండగా పక్షుల కలకలా రావంతో దినచర్య ప్రారంభమై రాత్రి 9 గంటలకి మస్తులు పరుండే వరకు అవిచ్ఛిన్నంగా సాగుతూండేది.

బాబాతో పనిచేస్తున్నవారు ఆయనకున్న ఆధ్యాత్మిక మార్గంలోని యీ వింత సాహసికులకున్ను అంత సన్నిహితంగా ఉండడమనేది తమకున్న ఒక విశేషమయిన హక్కుగా భావించేవారు. కాని వారి పని అంత సులభం అని మనం అనుకూడదు సుమా. ఆరోగ్యవంతుడయిన మనిషికి ప్రతి రోజు ఉంటున్న పనిచేసెయ్యడమనేది అంతకష్టమేమీ కాదు. ఎంచేతంటే అతని మనస్సు, శరీరం దానికి అలవాటు పడిపోయి ఉంటాయి. అయితే ఒకే విధమయిన నిత్య కార్యక్రమం బాబా సాధారణంగా ఒప్పుకోరు, ఒక కార్యక్రమం అతి సులభమయినది అతి క్లిష్టంగా తయారి ఊరుకుంటుంది. ఈ విషయాలన్నీ అటువంటి ఆశ్రమ పనిలోమానవుని నడవడికి ఒక గొప్ప గీటురాయి వంటి వవుతాయి. ఎప్పుడడిగితే అప్పుడు ఏదడిగితే అది మస్తుల కివ్వడం అంటే అంత సులభతరమయిన పనేం కాదు, అటువంటి ఆశ్రమాల్లో పని చేసేవారు తమలో జాబ్ యొక్క ఓర్పును. హెర్క్యులిస్ యొక్క శక్తిని కలుపుకుని మానవతను విడువకుండా ఉంటూ ఈ గుణాలన్నింటికీ తోడు సంతోషంగా నవ్వును పుట్టించే చమత్కారం కూడా కలిగి ఉంటే వారి కార్యభారం తేలిక అయి హాయి కలుగజేస్తుంది. ఈ మూడు ముఖ్యమైన గుణాలు లేకపోయాయంటే శారీరకంగా ఉండే వారి లోపాల వలన చేసే పని యొక్క బాధ్యతలు ఎక్కువై వారిని కృంగదీసి ఎంత కష్టపడ్డా విజయం సాధించలేని స్థితిలోనికి వచ్చి వారి ఉద్వేగపు తుఫానులకు లొంగిపోతారు.

ఇంక చివరకి మూడు సంగతులు జ్ఞాపకం ఉంచుకోవాలి. బెంగుళూరు ఆశ్రమం మొత్తానికి, అందరికంటే ఘనమైన మస్తు నిస్సందేహంగా చట్టిబాబా. రెండో అధ్యాయంలో ఇతని చరిత్ర విపులంగా చెప్పేము కాబట్టి ఇక్కడ ఎక్కువగా వ్రాయలేదు. బెంగులూరు మస్తులలో మాత్రం అతడు అందరికంటె గొప్పవాడు.

రెండో సంగతేమిటంటే ఈ అధ్యాయంలో వర్ణించబడిన మస్తులుకాక ఇతరులు కూడ కొద్దిమంది ఉండేవారు. వాళ్ళంతట వాళ్ళు మంచి మస్తులినా ఇక్కడ వివరంగా చెప్పవలసినంత ముఖ్యమయిన వాళ్ళుకారన్నమాట. వీరినిగురించి అనుబంధంలో బెంగుళూరు క్రింత చెప్పబడింది.





ఆఖరి విషయమేమిటంటే ఏప్రిల్ 1940 ప్రారంభంలో ఈమస్తు ఆశ్రమం బెంగుళూరులో మూయబడి మే నెలలో బాబా వచ్చేసరికి మెహెరాబాద్‌లో తెరువబడింది. ఈ పైవిషయం దీని తరువాత అధ్యాయంలో వస్తుంది.

(బెంగుళూరు ఆశ్రమ చరిత్ర సమాప్తం)

### 4. మెహెరాబాద్ (1940 మే నుండి అక్టోబర్ వరకు)

"మెహెరాబాదు" అనే సరికి మనకి రెండు భావాలు స్ఫురిస్తాయి. మొదటిది మెహెర్‌బాబా యొక్క ప్రధాన కార్యస్థానము అనిన్ని రెండవది ఆయన నివసించే నిలయమనిన్ని. బాబా యొక్క జీవితకథలో అది ఒక చరిత్రాత్మకమైన ప్రదేశము. ఆయన యొక్క కార్యము ఆయన యొక్క ప్రభావము కూడా అక్కడి భూమిని అంటి పెట్టుకొని అది పవిత్రీ భూతమయినది.

అక్కడి రైలు మార్గము ప్రక్కనగాని, ఒకప్పుడు పాఠశాల భవనములుండి ఇప్పుడు చక్కని పచ్చగడ్డితో కప్పబడిన ఖాళీస్థలాలు కాని, అక్కడి పచ్చని తోరణాలవలె వ్రేలాడుచున్న వేప చెట్లుకొమ్మల నీడలయందు గాని, బాబా వెనుక తన ఆధ్యాత్మికానుభవముల గురించి ఇంకా ప్రకటించ నటువంటి అముద్రిత గ్రంథమును రచించుటకు కూర్చొనిన ఎండకు వానకు నిలచిన టేకు కఱ్ఱబోను దగ్గరగాని తిరుగాడవచ్చును. ప్రతీ చోటు ఒక కథను తెలుపుతుంది. ప్రతీ స్థలము బాబా ప్రభావము యొక్క అమరజ్యోతిలో వెలుగొందుతుంది. బాబా యొక్క మస్తు కార్యముల గురించి సింహావలోకనం చేస్తే– అంటే పిచ్చివారితోగాక అసలు మస్తులతో– మెహెరాబాద్‌లో ఇతర చోట్ల కంటె చాలా తక్కువ పని చేసేరని వ్యక్తమవుతుంది. 1938 సంవత్సరాంతము నుండి ఈ ప్రధాన కార్యస్థానమయిన మెహెరాబాద్‌లో బాబా అప్పుడప్పుడు తిరిగితిరిగి వచ్చినప్పుడు కొద్దికాలం పాటు ఉంటూ వచ్చేరు. 1940 మే నెల మొదటి వారంనుంచే మస్తు ఆశ్రమం అని చెప్పడానికి వీలయినది. అక్కడ రూపొంది ఆ సంవత్సరం దీపావళికి ముందే అది మూసి వేయడం జరిగింది. మూడు కారాణాలవలన మెహెరాబాద్‌లోని ఈ మస్తు ఆశ్రమం వర్ణించడానికి కష్టమవుతోంది. మొదటిది ఈ మస్తు ఆశ్రమం అనేది బెంగుళూరు మస్తు ఆశ్రమమే ఇక్కడికి తీసి కొచ్చి నెలకొల్పబడింది. బెంగుళూరు ఆశ్రమం గురించి ఇదివరకే చెప్పేశాము. రెండో కారణం– ఈ మెహెరాబాద్ మస్తు ఆశ్రమం మూడు వారాల పాటు జూలై నెలలో రాంచికి తీసికెల్లడం జరిగింది. అందుకని కొంచెం దీని చరిత్రలో తికమక ఏర్పడింది. అందువలన రాంచి ఆశ్రమం గురించి దీని తరువాత అధ్యాయంలో చెప్పవలసివచ్చింది. మూడో కారణం ఈ గ్రంథంలో వర్ణించబడని వారు ఎవరూ ఈ ఆశ్రమవాసులుగా లేరు. అంతా పాతవారే అన్నమాట. **–సశేషం**

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.





# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.